శ్రీ వేంకటదాస స్వామి ప్రణీత

ఆశ్రితకల్పశాఖి

భావసహితము

ఆశ్రిత కల్పశాఖి

భావసహితము

రచన : పరమహంస శ్రీవేంకటదాసస్వామి

భావరచన : శ్రీమాన్ వక్కపట్ల వృషాద్రిపతి

ముద్రణ : ఏప్రియల్ 2017

కాపీలు : 1000

ప్రాప్తిస్థానము :

శ్రీమాన్ మొవ్వ వేంకటాచలపతిగారు
శ్రీ వేణుగోపాలసేవాశ్రమాధిపతులు
పూడివాడ, నగరం (మం), గుంటూరు జిల్లా
9866807402

ప్రింటింగ్ : శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ - 2
9490634849

వెల : అమూల్యము

కృతజ్ఞత

గోవిందసుందర పదాంబుజ మగ్నచిత్తో
మందాకినీ తులిత మంజుల వాక్ప్రవృత్యా
లోకం సమస్త మకరోదవ ధూతపాపం
తం వేంకటాఖ్య గురుమాత్మని భావయామః

సంసారతాపానల దగ్ధభావాః
సమాగతా యావవలోక్య సద్యః
భవన్తి బోధామృతసేక హృష్టాః
తామేగతిర్వేంకటదేశి కాంఘ్రీ

శ్రీరామ
జై సీతారామ్ జైజై సీతారామ్
శ్రీమతే రామానుజాయనమః   శ్రీ వేంకట గురుభ్యోనమః
శ్రీ శ్రీనివాస గురుభ్యోనమః   శ్రీ విష్ణుదాస గురుభ్యోనమః

చిన్న వినతి

ఆస్తిక శిఖామణులారా! ప్రణామంబులు

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీమన్నారాయణునికి నిత్యవిభూతీ, లీలావిభూతి రెండు విభూతులు గలవు. వీనియందలి జీవులు సర్వేశ్వర సంబంధితులే. కాని నిత్యవిభూతి యందలి జీవులు నిత్యులు, నిరంతరము సర్వేశ్వరుని కళ్యాణ గుణానుభవమగ్నులై ఆనందసాగరమందు తేలియాడుచూ సర్వేశ్వరుని సాయుజ్య, సారూప్యము పొందియుందురు. లీలావిభూతిలో జీవులు కర్మబద్ధులై, బద్ధ సంసారసాగరమందు మునిగి జీవితములు దుర్భరముగా గడుపుచుందురు. వీరిని ఉద్ధరించుటకై సర్వేశ్వరుడు రామకృష్ణాది అవతారములెత్తెను. పిదప, సర్వేశ్వరునితో మాట్లాడి, ఆటలాడిన ఆళ్వారులను ఈ లీలా విభూతియందు జనింపజేసెను. వారి ద్వారా మానవులకేగాక పశుపక్ష్యాదులకు మోక్షప్రాప్తి కలుగజేసెను. వారి యనంతరము వారి రచనలు మానవాళికి మోక్ష సోపానము లాయెను. సర్వేశ్వరుడు నిరంతరము తనకంటే, తన భక్తులకు ప్రాధాన్యతనిచ్చును. భగన్ముఖారవింద సంజనితమగు 'గీతను' తన భక్తుడగు సంజయుని ద్వారా లోకమునకందజేసెను. అట్లే విష్ణు సహస్రనామమును తన భక్తుడగు భీష్మాచార్యులచే తన ఆశ్రితులగు ధర్మరాజాదిపాండవులకు బోధింపజేసెను. ఇదంతయు సర్వేశ్వరునికి తన భక్తుల యెడ యున్న ఆశ్రిత పక్షపాతము భగవద్గీత, విష్ణుసహస్రనామములు భగవద్భక్తులను సంసారార్ణవమును తరింపజేయునావలు ఆ విధముగానే ఆళ్వారులు, ఆచార్య పురుషుల రచనలన్నీ బద్ధసంసారులనుద్ధరించుకు ఉత్పన్నమైనవేగాని వారి కొరకుగాదు.

మహర్షి శ్రీ వేంకటదాసస్వామి వారి రచనలు కూడా ఆళ్వారుల, పూర్వాచార్యుల రచనల కోవకు జెందినవే. శ్రీవేంకట దాస స్వామివారు శతాధిక

గ్రంథకర్తలు అందు "ఆశ్రిత కల్పశాఖి" ఒకటి. ఈ గ్రంథమందు శ్రీ వేంకటదాస స్వామి వారు సరళమైన, సొంపైన పదాలతో, ఇంపైన వర్ణనలతో శ్రీకృష్ణజగదాచార్యుల కళ్యాణ గుణ కథాసుధను పొందుపరిచిరి. ఇందు నాల్గు ప్రకరణములు, నాల్గు మకుటములతో 111 శ్లోకములు గలవు. ప్రథమ, ప్రకరణం "వందేయశోదాసుతం" అనుమకుటముతో 30 శ్లోకాలు ద్వితీయ ప్రకరణం "కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం" మకుటముతో 30 శ్లోకాలు, తృతీయ ప్రకరణం "నమామి కృష్ణం జకదేకరక్షకమ్" మకుటంతో 25 శ్లోకాలు చతుర్థ ప్రకరణము" నమస్యామ్యహం వేణుగోపాలదేవం" అను మకుటముతో 26 శ్లోకాలు గలవు.

శ్రీ వేంకట దాస స్వామి వారు స్థాపించిన శ్రీ భాష్య కార సమాజ సభ్యులు స్వామివారి రచనలను అమిత ఆనంద శ్రద్ధా భక్తులతో కంఠస్థముజేసి శ్రీ వేణుగోపాలుని బ్రహ్మోత్సవ కార్యక్రమములందు సందర్భానుసారముగా గానముగావింతురు. ''ఆశ్రిత కల్పశాఖి'' సరళముగా యున్నను సంస్కృతమగుటవలన, భావము పూర్తిగా సర్వులకు అవగతమగుట అసాధ్యము భావము అర్ధమైన యెడల భాగవతులు నిత్యపారాయణ గ్రంథముగా భావింతురని తలంచి విజయవాడ నివాసులు శ్రీ భాష్య కారసమాజ సభ్యులు, మాపిన తండ్రిగారి జామాత "ఉభయ వేదాంత విద్యా వాచస్పతి" అగు శ్రీ వక్కపట్ల వృషాద్రిపతిగారిని "ఆశ్రిత కల్పశాఖి"కి భావమును వ్రాయవలసినదిగా అభ్యర్ధించితిని అందులకు వారు ముదముతో గురు కైంకర్యముగా అంగీకరించి, వ్రాత ప్రతిని పంపవలసినదిగా తెల్పిరి. శ్రీస్వామివారి అముద్రిత రచనలన్నిటిని స్వామి వారి దౌహిత్రులు, నాకు బావమరిది, నగరం కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ అగు శ్రీ పద్యాల గోపీచంద్ర స్వామికీ విషయమును తెలియపరచిన వెనువెంటనే నూతన వ్రాత ప్రతిని రెండవ దినముననే నాకందజేయగా శ్రీ వృషాద్రిపతిగారికి జేర్చితిని. అనతిదినములలోనే భావమును సరళరీతిలో వారి విద్యాబలమునకు తగినట్లు వ్రాసిరి.

ఇందు శ్రీ వేంకట దాస స్వామి వారు నాల్గు మకుటములతో "వందే" అను పదంతో సర్వేశ్వరుని ప్రపత్తి జేసిరి. అందులకు శ్రీ వృషాద్రిపతి గారు వాడిన పదజాలము అనన్య సాధ్యమని భావింపక తప్పదు. ఉదాహరణకు వారు ప్రయోగించిన పదములు : వందనములు నమస్కారములు, గిడిగిళ్ళు, మ్రొక్కులు, ఏటికోళ్ళు, గొబ్బులు, బరిగలు, కయిచాపులు, కేకిసలు, కైమోడ్పులు, మొగ్గలు,

కేలు మొగ్గలు, కేలు మోద్పులు, కోపులు, గుంజిళ్ళు, గొబ్బిళ్ళు, చాగిలింతలు, చిన్నిదములు, చిన్నిపూలు, చిన్ని పూఱేకులు చేకూర్పులు, చేమోడ్పు, చేవిప్పు, జాగిలి జేజేలు జోహార్లు, జ్యోతులు జోవిళ్ళు టెంకణాలు తొంగలిపాట్లు దండాలు దీవెనకొాలలు, నేరెడల్లులు పిడికింతలు వెన్నెలలు వెన్నెల కోలలు మోడుపూలు సలాము ఎఱగుళ్లు, చెంగనాలు మున్నగునవి వారి విద్యాబలదర్పమునకు ప్రతీకలు.

గ్రంధముద్రణకు నాకృతముగా కొంత కాలహరణమైనది. ఇదీ భగవత్ కృపయే. శ్రీ మహర్షి వేంకట దాస స్వామి వారి సంకల్పములు వజ్ర సంకల్పములు వారు తమ రచనలలో పూడివాడ వేణుగోపాల అష్టోత్తర శతకమందు "లలినీయాలయమందు నిత్యము నమూల్యంబైన భూషాచయంబులు వస్త్రంబు లదభ్రరత్న నిచయంబుల్ రూప్యగాంగేయముల్బలు వాహంబులు మంటపంబు లధికప్రాకారముల్గోపురంబులు నిర్మించి మహోత్సవంబులొాలయంబోషింపుగోపాలకా" అని రచించి యుండిరి.ఆ సంకల్పము కాలగమనమందు సఫలమైనది. ది. 13.2.2016న గోపురత్రయ ప్రారంభోత్సవము మహా వైభవముగా జరిగెను. శ్రీ వేణుగోపాలుని దేవాలయానికి ఉత్తర ప్రాకారమందు నారాయణ (వైకుంఠ) ద్వారము దేవాలయ ఆదిమ అర్చక స్వామి కుమారుడు, పరమపదవాసి శ్రీ దిట్టకవి వెంకట తాతాచార్యుల గారి సంకల్పముతో ద్రవ్యదాతలు వారి మేనళ్ళుళ్ళు శ్రీ కోసూరి వెంకట శేషావతారాచార్యులు, శ్రీ రామకృష్ణమాచార్యులు, దక్షిణమున రంగనాధ ద్వార గోపురం స్వామి వారి పౌత్రుడు, మొవ్వ సరోజ నాభుడు, వీ.ధ.ప. శ్రీమతి ఉదయలక్ష్మి ద్రవ్యముతోను, పశ్చిమమున శ్రీ భద్రగిరిరామ ద్వార గోపురం శ్రీ స్వామివారి మునిమనుమరాలు శ్రీమతి కాలారి వీర రాఘవయ్య శ్రీమతి హరిప్రసాదమ్మగార్ల కుమార్తె శ్రీమతి ఆకుల మాధవి వీరి భర్త ఆకుల వెంకట మారుతి శాస్త్రి గారి ద్రవ్యముతో బహు సుందరముగా నిర్మింపబడినవి. "ఋషివాక్యములు రిత్తబోవు" అనుటకివి నిదర్శనములు. దేవాలయ గోపురముల ఫొటోలు – భాష్యకార సమాజసభ్యుల ఛాయా చిత్రాలుగా గ్రామగ్రామము నుండి అందిన వరకుఇందు పొందు పరచటమైనది. ఇందులకు కాలహరణమైనదని విన్నవించుచున్నాను.

మహర్షి శ్రీ వేంకట దాసస్వామి ఆశ్రిత కల్పశాఖియందు సృష్టి స్థితి లయ కారకుడు, యదుశ్రేష్ఠుడు, నీలమేఘశ్యాముడు, త్రిభువ సుందరాకారుడు, పీతాంబరధారి, అర్జున సఖుడు పార్ధసారధి, దేవకీవసుదేవపుత్రుడు,

యశోదాసుతుడు, నందనందనుడు గోపికాజారుడు, తాపసాధారుడగు శ్రీకృష్ణజగదాచార్యుల, పలుకులు కులుకులు, నవ్వులు, నడకలు, చేష్టలు, దివ్యములుగా, ఆశ్రితులకు వరదాయకములుగా వర్ణించియున్నారు. ఈ గ్రంధమును పారాయణ గావించువారలకు సర్వేశ్వరుడే కొంగుబంగారమగునని మహర్షి సుబోధగావించెను. కావున శ్రీ భాష్యకార సమాజసభ్యులెల్లరు దీనిని నిత్యము పఠించి ధన్యతములగుదురని నా పార్ధన.

ఈ గ్రంధమునకు సొంపైన భావమును, అనేక పురాణ విషయ కలితముగా, పద భావనా గాంభీర్యములతో, గురుకైంకర్యముగా, భక్తి శ్రద్ధలతో భావమును వ్రాసి భక్తుల కరకమలముల కందజేయుటలో ప్రధమ భూమికగా యున్న “ఉభయవేదాంతవాచస్పతి” శ్రీమాన్ వక్కపట్ల వృషాద్రిపతిగార్కి అస్మత్ పితామహులగు మహర్షి శ్రీ వేంకట దాస స్వామి వారి కృపాకటాక్షములు, వారిచేత ప్రతిష్ఠింపబడిన శ్రీ రుక్మిణీ సత్యభామ రాజ్యలక్ష్మీ ఆండాలు హనుమ సమేతుడగు శ్రీ వేణుగోపాలదేవుడు ఆయురారోగ్య ఐశ్వర్య, భోగభాగ్యాలను ప్రసాదించవలెనని స్వామికి శతకోటి సాష్టాంగదండవత్ ప్రణామంబు లాచరించుచున్నాను. ఇందు ముద్రించిన శ్రీ భాష్యకార సమాజ సభ్యులఛాయాచిత్రములను గ్రామ గ్రామమునకు తిరిగి స్వీకరించిన అగ్రజ శ్రీమతి ఇందిరాదేవిగార్కి వీరి భర్త శ్రీ వేంకటేశ్వరరావు బావగార్కి, నేను భగవత్ కార్యమును దేనిని ప్రారంభించినా ప్రోత్సహించి ఆనందించి, ఆశీర్వదించే మా మేనత్తగార్లు శ్రీమతి రాముబాణమ్మ గార్కి, శ్రీమతి కమలాదేవిగార్లకు కృతజ్ఞతాపూర్వక నమోకములు. శ్రీశుడు ఆయురారోగ్య ఐశ్వర్యములొసగుగాక.

నేను ప్రారంభించిన ప్రతి దైవకార్యమును కాదనకప్రోత్సహించి తనవంతు ధర్మమును నిర్వహించు నా ధర్మపత్ని చి॥ల॥సౌ॥ ఉదయలక్ష్మికి సర్వేశ్వరుడు సర్వదా, ఆయురారోగ్య భోగభాగ్యాల నొసగిగాచుటకు నందనందనునికి ప్రణతులొనర్చుచున్నాను. ఈ గ్రంథ ముద్రణకు వలయు ద్రవ్యమొసగిన నా కుటుంబ సభ్యులు పెద్దకుమారుడు చి॥ మురళీగోపాలప్రసాదు వీ. ధ. ప. శ్రీమతి సుజాత, పౌత్రులు చి॥ రామతేజ, చి॥ రఘునందనుడుకి, నా చిన్న కుమారుడు చి॥ కళ్యాణ బాలాజీ, వీ. ధ. ప. లక్ష్మీఆండాల్, పౌత్రీమణులు చి॥ విష్ణుప్రియ, చి॥ శ్రీ చందనలకు మరియు నా పెద్దకుమార్తె చి॥ల॥సౌ॥ కాలారి జగన్నాధరాణి భర్త చి॥ రమానృసింహ ప్రసాదు, దౌహిత్రుడు చి॥ రఘువీరరాయలుకు, చిన్నకుమార్తె చి॥ల॥ సౌ॥ రెవినిశెట్టి అరవింద, భర్త శ్రీ

శేఖర్, దౌహిత్రుడు కృష్ణతేజ, దౌహిత్రి ముకుంద ప్రియలకు అస్మత్‌పరమాచార్యులు, పితామహులగు మహర్షి శ్రీ వేంకటదాసస్వామివారును, లక్ష్మి విభ్రాజమాన వక్షస్థులుండగు శ్రీమన్నారాయణుడును, దయాస్వరూపిణి యగు జన్మాతయును, పితామహులచే పూడివాడలో ప్రతిష్ఠింపబడిన శ్రీ రాజ్యలక్ష్మి రుక్మిణీ సత్యభామా, ఆండాలు, ఆంజనేయ సమేతుడగు శ్రీ వేణుగోపాల పరబ్రహ్మ, పూర్ణాయురారోగ్యైశ్వర్య, భోగ, భాగ్యములను, ఇచ్చి సర్వదారక్షించుటకై శతకోటి ప్రణామమ్ములర్పించుచున్నాను. ఈ గ్రంథమును, ఓర్పు, నేర్పులతో కడుసుందరముగా తీర్చిదిద్దిన శ్రీశ్రీ ప్రింటర్స్ శ్రీ విశ్వేశ్వరరావు గార్కి, వారి సిబ్బందికి నా ధన్యవాద సహిత వామోకములర్పించుచున్నాను. ఇందలి గుణములు పెద్దల నుండి గ్రహించినవి దోషములున్న నావిగా భావించి చదువర్లు మన్నింప ప్రార్థన.

ఇట్లు

శ్రీ వేంకటదాస స్వామి రాధమాంబగార్ల పౌత్రుడు

శ్రీ మొవ్వ వేంకటాచలపతి "కృష్ణదాసు" అమ్మన్నమ్మగార్ల పుత్రుడు

వైష్ణవపాదరేణువు

మొవ్వ సరోజ నాభుడు

పూడివాడ

14-2-2017

మున్నుడి

యత్పదాంభోరుహధ్యాన విధ్వస్తాశేష కల్మషః
వస్తుతాముపయాతోఽహం వేంకటాఖ్యం నమామితమ్

వేదాలు మొదలు నేటి వరకూ అందరూ భగవంతుని స్తుతించారు. వారి వారి మేధా శక్తిననుసరించి, శ్రీ వేంకటదాస స్వామి వారు కూడా చాలా స్తోత్రాలు సంస్కృతాంధ్రాలలో రచించారు. స్వామివారు ఆజన్మవైష్ణవులు, సహజ పండితులు, ఆబాల్యకవులు. పూడివాడ గ్రామంలో సదన సన్నిధిని శ్రీ రుక్మిణీ సత్యభామాసమేత శ్రీ వేణుగోపాలస్వామిని ప్రతిష్ఠ చేశారు. అప్పటివరకూ వారి వంశంలో ఒక్కొక్కరే వున్నవారు వేణుగోపాలుని ప్రతిష్ఠ తరువాత ఎక్కువ అభివృద్ధి చెందారు. అందుకే వారి 'ఆశ్రితకల్పశాఖి' స్తుతిలో 85 శ్లోకంలో 'మదన్వయానందకరార్థ సంచయమ్' మా వంశంలో వారికి ఆనందాన్నిచ్చే అర్ధ సంచయము నీవు అంటూ నుతించారు. ఈ స్తుతిని పారాయణచేసేవారందరికి వేణుగోపాలుడు ఇహలోకంలో పుత్ర పౌత్ర, ఆయురారోగ్య సంపదలిచ్చి మోక్షాన్ని కూడా ప్రసాదిస్తాడు.

విన్నవించు భాగవత విధేయుడు
విద్యావాచస్పతి, వేదాంతశిరోమణి
వక్కపట్ల వృషాద్రిపతి.

1. **శ్రీకృష్ణం జగదీశ్వరంభవహరం రాజీవ ప్రతేక్షణం**
వైదర్భీ కుచకుంకు మాంకిత బృహద్వక్షఃకవాటోజ్వలం
బాలాదిత్య సదృశ్యభాసుర మహాపీతాంబరాలంకృతం
ప్రావృట్కాలవలాహకాభ వపుషం వందేయశోదాసుతం

అవతారిక: పరమహంస, బ్రహ్మర్షి మహాకవి శ్రీ వేంకటదాసస్వామి వారు, ఆశ్రయించిన వారి కోర్కెలు తీర్చే కల్పవృక్షం వంటి శ్రీ వేణుగోపాలదేవుని స్తోత్రం చేయడానికి సంకల్పించి ఇలా ఆరంభించారు.

భావము : శ్రీకృష్ణునిగా అవతరించినవాడు లోకాలను పాలించేవాడు, సంసార భయాన్ని పోగొట్టేవాడు, తామరపుష్పములవలే విశాలమైన నేత్రాలు కలవాడు. విదర్భరాజకుమార్తె రుక్మిణీదేవి ఆనందంతో తనను కౌగలించుకోగా, అలంకారానికి ఆమె స్తనములయందు చిత్రించుకొన్న కాశీర్మ కుంకుమ అంటుకొని, ప్రకాశిస్తున్న విశాలమైన వక్షస్థలం కలవాడూ, ఉదయించే సూర్యుని వంటి బంగారు రంగుగల పీతాంబరం అనే పేరుగల పచ్చనివస్త్రాన్ని అలంకారంగా ధరించినవాడూ, వర్షాకాలంలోని మేఘంవలె నల్లనిదేహకాంతి కలవాడూ అయిన యశోదా నందనునికి వందనాలు.

ఛందస్సు : మొదటి ప్రకరణంలో శార్దూల వృత్తాలున్నాయి. వీనిలో క్రమంగా మ,స,జ,స,త,త,గ, అనే గణాలుంటాయి. సంస్కృతంలో అక్షరయతి వుండదు. యతిస్థానంలో విరామముంటుంది.

2. **వందేయాదవ వంశవార్ధి శశినం వందే ఖగేంద్ర ధ్వజం**
వందేభారత జన్యయోధహరణం వందే జగత్పావనం
వందే పార్థరథప్రచార నిపుణం వందే దయావారిధిం
వందే సంతతపూడివాడ నిలయం వందేయశోదాసుతం

భావము : ఎల్లప్పుడూ పూడివాడ దేవాలయంలో నివసించే యశోదానందవర్ధనా! నీకు వందనాలు. యాదవ వంశమనే సముద్రాన్ని సంతసింపచేసే యదు చంద్రా! నీకు నమస్సులు. గరుడధ్వజా! వందనం, భారతయుద్ధంలో పాల్గొన్న వీరులను కాలస్వరూపంతో సంహరించిన నీకు వందనం. లోకాలను పవిత్రం చేసే నీకు వందనం. అర్జునుని రథాన్ని యుద్ధరంగంలో చాకచక్యంతో నడిపిన పార్థసారధీ! నమస్సులు. ఓ దయాసముద్రుడా నీకు శతకోటి వందనాలు.

3. ఆభీరార్భక సంచయావృత మజం మాహాసమూహావనం
గుంజాహార పరిష్కృతం గుణనిధిం బర్హావతంసో జ్వలం
ధీరం వల్లవ కామినీ కుచయుగాలంకార హస్తాంబుజం
ధాత్రీభార వినాశకారణ తనుం వన్దే యశోదాసుతమ్

భావము : గోపబాలకులు తన చుట్టూ చేరియున్నవాడు. పుట్టుక లేనివాడు. గో సంఘాన్ని రక్షించేవాడు. గురివింద పూసల దండలు దాల్చినవాడు. మంచి గుణాలు కలవాడు, నెమలి పింఛం ధరించినవాడు. ధైర్యశాలి, గొల్లస్త్రీల స్తనద్వయానికి అలంకారమైన కరపద్మాలు కలవాడు, భూభారం నశింపచేయడానికి అవతరించిన వాడూ అయిన యశోదా నందనునికి నమస్కారాలు.

4. రక్తాంభోజ సమానపాదయుగళం రాకేందుబింబాననం
నీలారాళమనోజ్ఞ కుంతల భరం భక్తాశయోత్సాహదం
నానావిఘ్నవినాశనం రిపుహరం సత్కార్య నిర్వాహకం
కృష్ణం జాంబవతీమనోజ్ఞనిలయం. వందే యశోదాసుతం

భావము : ఎఱ్ఱతామరల వంటి పాదాల జంట కలవాడు, పదహారు కళలతో కూడిన పూర్ణ చంద్రుని వంటి ముఖం కలవాడు, నల్లనివి, రింగులు తిరిగినవి, మనసుకి ఆహ్లాదాన్ని కలిగించేవి అయిన తలవెంట్రుకలు కలవాడు (గిరజాల జుట్టు కలవాడని భావం) భక్తుల హృదయాలకు సంతోషాన్నిచ్చేవాడు. భక్తుల విఘ్నాలను నశింపచేసేవాడు, భక్తుల శత్రువులైన కామక్రోధాదులను హరించేవాడు, మంచి పనులను నిర్వహించేవాడు, జాంబవంతుని కుమార్తెయూ తన భార్యయూనైన జాంబవతి హృదయపద్మంలో నివసించేవాడూ అయిన యశోదాకుమార కృష్ణునికి గిడిగిళ్ళు.

5. **వ్యాస వ్యాసజనారదాది మునిభిః సంసేవితాంఘ్రిద్వయం**
ద్రౌపద్యైపటదాయకం ద్విజకులోద్భూతాయ సంపత్ప్రదం
కుబ్జాయౌవన సౌకుమార్య నవలావణ్యాతి సౌందర్యదం
సత్రాజిత్తనయా మనోబ్జమధుపం వందే యశోదాసుతం

భావము : వ్యాసమహర్షి, ఆయన కుమారుడైన శుకమహర్షి, నారదుడు మొదలైన మునులు సేవించే పాదపద్మాలు కలవాడు, దుశ్శాసనునిచే పరాభవింపడుచున్న ద్రౌపదికి వస్త్రములిచ్చి రక్షించినవాడు. కుచేలునికి కుబేరునికున్నంత ఐశ్వర్యమిచ్చిన వాడు, మధురానగరంలో తనకు చందనగంధాన్నిచ్చిన త్రివక్రయైన కుబ్జకు యౌవనము, సుకుమారత్వము, లావణ్యము (సముదాయశోభ) లోకంలో ఎవరికీ లేని సౌందర్యాన్నిచ్చినవాడు, సత్రాజిత్తు కుమార్తె సత్యభామ మనస్సనే పద్మంలో తేనెతాగే తుమ్మెదవంటి వాడూ అయిన యశోదాసుతునికి మ్రొక్కులు.

6. **చైద్యారిష్టబకాఘ పౌండ్రక ముఖ క్రూరాసుర ధ్వంసినం**
గాంధారీసుత శల్య సూర్యజ జరాసంధాదిగర్వాపహం
పాండోః పుత్ర మనోరథోర్జిత ఫలం దుస్స్వప్న నాశంకరం
గీతాశాస్త్ర సుధాసరిత్పతిమహం వందే యశోదాసుతం

భావము : చేది దేశరాజైన శిశుపాలుడు, అరిష్టుడనే పేరుగల వృషభాసురుడు, బకాసురుడు (కొంగ) అఘాసురుడు (సర్పము) పౌండ్రక వాసుదేవుడు మొదలైన రాక్షసులను నాశనం చేసినవాడు, దుర్యోధన, శల్య, కర్ణ, జరాసంధుడు మొదలైన రాజుల గర్వాన్ని అణచినవాడూ, పాండురాకుమారులైన పంచపాండవులు కోరుకున్న వాడు, చెడుకలలను రానీయనివాడు, గీతాశాస్త్రమనే అమృత సముద్రాన్ని లోకానికి అందించినవాడూ అయిన యశోదా సుతునికి ఎరగుచున్నాను.

7. **గంగాసంభవ కారణాంఘ్రి కమలం గాంగేయ మోక్షప్రదం**
గాంగేయాంబర భూషితామలతనుం గంగాధరారాధితం
గాంగేయోదర జన్మకారణ సరోజాన్వీత నాభిస్థలం
జాయార్థత్రిదశాగ మాపహరణం వందేయశోదాసుతం

భావము : గంగానది పుట్టుకకు హేతువైన పాద పద్మం కలవాడు, (గంగపాదంలో నుంచి పుట్టిందని భావం) గంగాకుమారుడైన భీష్మునికి మోక్షమిచ్చినవాడు, బంగారు వస్త్రాన్ని దివ్యమంగళ విగ్రహం పైన ధరించిన వాడూ, గంగాధరుడైన శివుని పూజలందుకొనేవాడు, హిరణ్మయగర్భుడైన చతుర్ముఖ బ్రహ్మపుట్టుకకు కారణమైన పద్మం నాభియందు కలవాడు, (సరోజనాభుడు) భార్య సత్యభామ కొరకు దేవతల చెట్టు కల్పవృక్షాన్ని అపహరించుకొని ద్వారకా పట్టణానికి తెచ్చినవాడూ అయిన యశోదాసుతునికి ఐదుపదిచేయుచున్నాను.

8. **దీవ్యత్కాళియ నామకోరగ ఫణా మాణిక్యకాంతి చ్ఛటా**
కిర్మీ రాంఘ్రి తలద్వయం శ్రుతి సమిద్వేద్యం జగన్మోహనం
స్ఖాలిత్యే తరబ్రహ్మచర్య నిలయంరాజన్య కన్యా సహ
స్రానీతాద్భుత వైభవాస్పదమహం వందే యశోదాసుతం

భావము : కాళీయుని తలలపైన నాట్యం చేస్తూ ఆ పాముతలలపై నున్న పద్మరాగమణుల కాంతుల చేత రంగులు రంగులుగా ప్రకాశించిన అరికాళ్ళ జంట కలవాడు, వేద, వేదాంతాల ద్వారా తెలుసుకోదగినవాడు, లోకాలను మోహింప చేసే సౌందర్యం కలవాడు, అస్ఖలిత బ్రహ్మచారి, పదహారువేల నూట యెనిమిది మంది భార్యలతో, అన్ని భవనాలతో లెక్కకుమించిన పుత్ర, పౌత్ర సంతతి కల విభవంతో విరాజిల్లినవాడూ అయిన యశోదానందనునికి ఏటికోళ్ళు.

9. **జ్ఞానానందమయం పరాక్రమ నిధిం లావణ్య సత్యాస్పదం**
తారుణ్యార్జవ శౌర్యధైర్య బల శక్తి స్థైర్య గాంభీర్య వీ
ర్యౌదారాశ్రితవత్సలత్వ మృదుతా సౌ శీల్య మాధుర్యధీ
స్తేజః కారుణి కత్వ సామ్యసదనం వందే యశోదాసుతం

భావము : జ్ఞానానందమయ స్వరూపుడు, పరాక్రమనిధి స్వభావసిద్ధమైన లావణ్య, తారుణ్యాది శరీరగుణాలూ, ఆర్జవ, శౌర్య, ధైర్య, బల, శక్తి, స్థైర్య, గాంభీర్య, వీర్య, ఔదార్య, ఆశ్రిత వాత్సల్య, మార్దవ, సౌశీల్య, మాధుర్య, తేజస్సు, దయ, సామ్య మొదలైన ఆత్మగుణాలకూ స్థానమైన యశోదాసుతునికి గొబ్బులు. విశేషం : జ్ఞానానందమయమైనది ఆత్మస్వరూపం, లావణ్యాదులు శరీర (రూప) గుణాలు. ఆర్జవాదులు ఆత్మగుణాలు. స్వరూప, రూప, గుణ, అన్న గద్య త్రయ వాక్యానికి ఉదాహరణగా ఈ శ్లోకాన్ని చెప్పుకోవచ్చు.

10. **దేవక్యాస్తనయం సురూపదనం లీలా మనుష్యాకృతిం**
చారుస్నిగ్ధకపోల యుగ్మలలితం గాంభీర్య వారాన్నిధిం
మౌనిధ్యేయ పదారవిన్దయు గళం రామామనోమన్మథం
బంధూక ప్రసవాధరం శుచికరం వందే యశోదాసుతం

భావము : దేవకీదేవి తనయుడు, గొప్ప అందగాడు, విలాసంగా మనుజరూపాన్ని ధరించిన దేవాదిదేవుడు, సుందరమైన నున్నని చెక్కిళ్ళు గల వాడు, లోతు తెలియనివ్వని గంభీర గుణానికి సముద్రం వంటి వాడు, ఇంద్రియ జయం కల మునులు ధ్యానించే జంట పాద పద్మాలు కలవాడు, స్త్రీల మనస్సులను మథించే మన్మథుని వంటివాడు, మంకెన పువ్వు వలె ఎఱ్ఱని క్రింది పెదవి కలవాడు, ఆశ్రయించిన వారిని పవిత్రం చేసేవాడునయిన యశోదా సుతునకు ఒరిగలు.

11. **గ్రైవేయాంగదహార శృంఖల కిరీట స్ఫారహీరోర్మి కా**
రాజత్కంకణ కింకిణీకకటకప్రాలంబికా నూపుర
శ్రీమత్కౌస్తుభ కర్ణవేష్టన ముఖాలంకార సంశోభితం
నీరేజాత భవాండభాండ జఠరం వందేయశోదా సుతం

భావము : కంఠహారాలు, బాహుపురులు, పొడవైన హారాలు, మొలతాడు, కిరీటము, వజ్రపుటుంగరాలు, చేతిసరాలు, ముంజేతి వలయాలు, చిన్న చిన్న మువ్వలు కల కాళ్ళ అందెలు, కంఠమునందు ప్రకాశించే కౌస్తుభమణి, చెవులకు కుండలాలు, మొదలైన అలంకారాలతో విరాజిల్లే సర్వాంగ సుందరుడు, అనేక కోట్ల బ్రహ్మాండాలనే కుండలు కడుపులో కలవాడు నయిన యశోదానందునికి కయిచాపులు.

12. **శార్ఙ్గోదగ్రరథాంగ శంఖ విలసత్కౌమోదకీ నంద కా**
ద్యక్షీణాయుధ ధారిణం కువలయామోదంకరం శ్రీకరం
గోవత్సార్భకపాళిరూపవిధినా వాణీశగర్వా పహం
వేదాతీత మహాగుణాన్విత మహం వందేయశోదాసుతం

భావము : శార్ఙ్గమనే పేరుగల ధనుస్సు, వేయి అంచులు గల సుదర్శన చక్రము, పాంచజన్య మనే శంఖం, కౌమోదకి అనుగద, నందకమనే ఖడ్గము ఈ పంచాయుధాలతో పాటుగా ఇంకా మరి కొన్ని గొప్ప ఆయుధాలను ధరించినవాడు భూమి యందలిజనులకు ఆనందం కలిగించే వాడు, సంపదలిచ్చేవాడు, ఆవుదూడలను గొల్లపిల్లలను అపహరించి కొండగుహలో పెట్టిన బ్రహ్మగర్వాన్ని ఆ రూపాలను తానే ధరించి హరించినవాడు, వేదములకే అందని గుణములు కలవాడు నయిన యశోదాసుతునికి కేకిసలు.

13. **డిండీ రామరభూజనీలగళ హారక్షీర నీహారక**
ర్పూరశ్వేత పటీరహీర బలకైలాస స్థిరాభృచ్ఛర
న్మేఘాహేశమరాళ చంద్ర మృగరాడ్దుగ్ధాంబురాట్ఛారద
జ్యోత్స్నానారద తుల్యకీర్తి సహితం వందేయశోదాసుతం

భావము : నీటినురుగు, కల్పవృక్షం, శివుడు, ముత్యాలదండ, పాలు, మంచు, కర్పూరం, తెలిదీవి (శ్వేతద్వీపం) చందనం, వజ్రము, బలరామస్వామి, కైలాసపర్వతం శరత్కాల మేఘం, ఆదిశేషుడు, హంస, చంద్రుడు సింహము, పాలసముద్రము, శరత్కాలపు వెన్నెల నారద మహర్షి – ఈ తెల్లని వాటితో సమానమైన కీర్తిగల యశోదానందనునికి కైమోడ్పు.

(కీర్తి తెలుపని అపకీర్తి నలుపని వర్ణించుట కవి సమయం అంటే కవుల పద్ధతి అని అర్థం)

14. **మాలాకార సమర్పితామలసుమైస్సంతోషిత స్వాశయం**
కుబ్జాదత్త సుగంధ వస్తునికరైరావాప్త చర్చాయుతం
దాసీపుత్ర వరాన్న భావిత మహా సౌహిత్య సీమా పదం
కృష్ణాసాదిత శిగ్రులేశముదితం వందేయశోదా సుతం

భావము : మధురానగరంలో మాలాకారుడిచ్చిన పూలదండలకు సంతోషించిన హృదయం కలవాడు, కుబ్జ సమర్పించిన అత్తరు, పునుగు, గంధం, జవ్వాజి మొదలైన సుగంధ ద్రవ్యాలు అలదుకొన్నవాడు, దాసీపుత్రుడైన విదురుడు భక్తితో చేసిన విందు భోజనానికి చాలా సంతోషించినవాడు, ద్రౌపది పెట్టిన ఆకుకూరకు ఆనందించినవాడు నయిన యశోదా సుతుడికి కేలు మొగ్గులు.

15. భీమాపాయకరాంధ భూవరకృత చ్ఛద్మక్రియాధ్వంసినం
గాంధారీకృత శాపదోష విఫలవ్యాపార సంధాయకం
గాంధారేయ కృతాపచార హరణోపాయే చ వైజ్ఞానికం
పాపధ్వంస కరం విభూతి సదనం వందేయశోదాసుతం

భావము : భీముని కౌగిలించుకుని చంపివేయాలనుకున్న గుడ్డిరాజు ధృతరాష్ట్రుడు పన్నిన మాయోపాయాన్ని ఉక్కుతో తయారు చేయించిన భీముని ప్రతిమను వానిముందు నిలిపి వాడికుట్రను భగ్నం చేసినవాడు, గాంధారి "మీ యాదవులు కూడా ఇలాగే కలహించి చనిపోతారు" అని శపించగా, "అత్తా! భూభారమెలా హరించాలి, మా వారినెలా నశింపచేయాలి అని ఆలోచిస్తున్న నాకు ఈ శాపంతో మేలు చేశా"వని గాంధారిని నిర్విణ్ణురాలిగా చేసినవాడు. గాంధారీకుమారుడైన దుర్యోధనుడు తాను రాయబారిగా వెళ్ళిన సమయంలో పన్నిన మాయోపాయాలను తిప్పికొట్టిన వైజ్ఞానికుడు, ఆశ్రయించిన వారి పాపాలు పోగొట్టి సంపదలు కలిగించే యశోదానందనుడికి కేలుమొగ్గలు

16. గోప్తారం నిజదాస సంచిత ధనాగారాది సత్సం పదాం
హర్తారంభయ విఘ్నరోగరిపు సర్పాది ప్రభూతాపదాం
భర్తారం చతురాననాండ భవభూతానాంనగానాంసదా
సర్వజ్ఞం సకలాగమస్తుత తనుం వందేయశోదాసుతం

భావము : తన భక్తులకు తరగని ధనము, ఇళ్ళూ మొదలైన సంపదనిచ్చి వాటిని పోకుండా కాపాడేవాడు, భయాలు, విఘ్నాలు, రోగాలు, శత్రువులు, సర్పాలు మొదలైన వాటి ద్వారా కలిగే ఆపదలను పోగొట్టేవాడు. చతుర్ముఖ బ్రహ్మాండంలో జంగమ, స్థావరాలను తానే భరించి సృష్టి జరిపించేవాడు, ఆ బ్రహ్మాండాలలోని సమస్త వస్తు సముదాయం యొక్క స్థితిగతులన్నీ తెలిసిన సర్వజ్ఞుడు, సమస్త వేదశాస్త్రములచేత నుతింపబడే దివ్యమంగళ విగ్రహం కల యశోదా సుతునికి కేలుమోడ్పులు.

17. ధాత్రీ దేవ నివేదితాల్ప పృథుకైరా నంద సంపాదకం
గోపస్త్రీజన సంచయార్పిత జలస్నానేన హృష్టాశయం
నందాభీర నిదేశ నిఘ్నమనసా మాహోచ్ఛటా పాలకం
సౌశీల్యాకర మాదిదేవ మమలం వందే యశోదాసుతం.

భావము : బ్రాహ్మణుడైన కుచేలుడిచ్చిన కొంచెం అటుకులకే ఆనందపడి ఆయనకు అధిక సంపదలిచ్చినవాడు, ప్రళయకాల జలం తన రోమకూపాన్ని కూడా తడపలేని మహిమకలవాడయ్యి గోపికాస్త్రీలు దోసిటి జలాలతో స్నానం చేయిస్తే ఆనందించినవాడు, బ్రహ్మాది దేవతలను శాసించేవాడైనా ఒక సామాన్య గొల్లనందుని ఆదేశంతో గోవులను కాచినవాడు. గొప్పవాడు తక్కువవారితో అరమరికలు లేకుండా కలిసి తిరిగే సౌశీల్యగుణానికి ఇక్కయైనవాడు, ఆదిదేవుడు, స్వచ్ఛమైన చరిత్ర కలవాడైన యశోదాసుతునికి కోపులు.

18. వేదాంతోదిత సర్వ సద్గుణ లసన్మాణిక్య వారాకరం
పుష్పేష్వాసవసంత వాసవకుమారాధిక్య రూపోజ్జ్వలం
జిష్ణు స్థాణు విరించనాది విబుధవ్యాహారదూరస్థితిం
వంశీనాదవినోదలో లుపమహంవందే యశోదాసుతం

భావము : ఉపనిషత్తులలో చెప్పబడిన, అపహత పాప్మా విజరః, విమృత్యుః, విజిఘత్సః, అపిపాసః, సత్యకామః, సత్యసంకల్పః, కల్యాణతమరూపః మొదలైన సద్గుణాలనే మాణిక్యాలకు నిధియైన సముద్రునివంటివాడు మన్మథుడు, వసంతుడు, జయంతులకంటె అధికమైన తేజోరూపం కలవాడు. శరీర సౌందర్యం కలవాడు. ఇంద్ర, శివ, బ్రహ్మ మొదలైన దేవతల స్తుతివాక్కులకు అందని వాడు, మురళీగాన వినోదంలో ఆసక్తికలవాడూ అయిన యశోదానందనునికి గుంజిళ్ళు.

19. సర్వైశ్వర్య ఖనిం నుతాఖిల మునిం సంగీర్ణ వేణుధ్వనిం
దైత్యధ్వంసకరం భయావళి హరం దీవ్యత్ప్రవాళాధరం
దీనానాం చబలం మఖోచితఫలం పాపౌఘమేఘానిలం
భూరిజ్ఞానయుతం ప్రమోదభరితం వందే యశోదాసుతం

భావము : సమస్త సంపదలకు నిధి (గని) సకల ఋషులకు స్తోత్రపాత్రుడు. కమ్మని వేణుగానం చేసేవాడు. రాక్షసులను నాశనం చేసేవాడు, భయాలను పోగొట్టేవాడు, ప్రకాశించే పగడం వంటి క్రింది పెదవి కలవాడు, దిక్కులేని వారికి దిక్కు, ఎవరిని గురించి యజ్ఞం చేసినాతానే ఫలమిచ్చే వాడు, పాపాలనే మబ్బులను పోగొట్టుటకు గాలి వంటివాడు, అన్నీ తెలిసిన సర్వజ్ఞుడు, ఆనంద స్వరూపుడు అయిన యశోదానందునికి గొబ్బిళ్ళు.

20. గోపస్త్రీ రమణం విలాసనిపుణం నైర్మల్య సత్యోల్బణం
సాధ్వీమానధనం విరాగిమననం కౌంతేయ యాగావనం
పీయూషాద్యముషం వినీలవపుషం శ్రీశంమహాపూరుషం
సూరిస్తోమ ఋతంలసత్సులపితం వందేయశోదాసుతం

భావము : గొల్ల స్త్రీలకు మనోహరుడు, ప్రియమైన దర్శనమిచ్చేవాడు, విమలసత్య స్వరూపుడు పతివ్రతల గౌరవాన్ని కాపాడేవాడు. ప్రపంచాన్ని గడ్డిపరకగా భావించి విడిచిపెట్టిన వారు కూడా నిరంతరం ధ్యానించే దివ్యమంగళ విగ్రహం కలవాడు. కుంతీ పుత్రులైన పాండవుల రాజసూయ యాగాన్ని రక్షించినవాడు, వ్రేపల్లెలో పాలూ, నేయి దొంగిలించినవాడు. నల్లని దేహంకలవాడు, లక్ష్మీభర్త, పురుషోత్తముడు, పండిత బృందంతో పూజింపబడేవాడు, మధురమైన మాటలు మాట్లాడేవాడు అయిన యశోదాసుతునికి చాగిలింత.

21. విద్యుత్తుల్యరుచంమధువ్రతకచం సంశ్లిష్ట గోపీకుచం
పత్రీభూతఖగం ధృతోన్నతనగం దీర్ఘోరుబాహాయుగం
పారావారకుటం ప్రసిద్ధమకుటం వేదాంత వాక్యస్ఫుటం
త్రైలోక్యాతి హితం కుబుద్ధి రహితం వందే యశోదాసుతం

భావము : మెరుపువంటి కాంతి కలవాడు, తుమ్మెదల వలె నల్లని వెంట్రుకలు కలవాడు, గోపవనితలను ఆనందంతో కౌగిలించుకున్నవాడు, పక్షియైన గరుడుని వాహనంగా చేసుకున్నవాడు, గోవర్ధన పర్వతాన్ని పైకెత్తి ధరించినవాడు, పొడవైన గొప్ప బాహువులు కలవాడు, సముద్రంలో ఇల్లుకలవాడు, లోకాలన్నింటికీ నేనే ప్రభువునని తెలిపే కిరీటం ధరించినవాడు, వేదాంత వాక్యాల చేత విశదంగా తెలియవచ్చేవాడు, మూడులోకాలకు మిక్కిలి మేలు కూర్చేవాడు, కపటబుద్ధి లేనివాడు అయిన యశోదానందునికి చిన్నిదము.

విశేషం : ప్రతిపాదంలోనూ అంత్యానుప్రాసశబ్దాలంకారం వున్నది.

22. వందేమాగధ పీడితాఖిలధరా భృద్బంధనచ్ఛేదకం
వందే భూసుతనిర్మితాధిప కుమారీబంధన ధ్వంసినం
వందేస్వాశ్రిత సంఘ భూరి జననప్రారబ్ధ నాశంకరం
వందే యోగి జనా శయాద్భుత కరం వందేయశోదాసుతం

భావము : జరాసంధుడు భైరవపూజకు బలి ఇవ్వడానికి తీసుకొని వచ్చి బంధించిన రాజులను, భీమునిచే జరాసంధుని చంపించి, ఆ రాజుల బంధనాలను విడిపించిన వానికి వందనం నరకాసురుడు శక్తి పూజకు తీసుకువచ్చిన పదహారువేల ఒక వంద మంది రాకుమార్తెలను, నరకుని చంపి, వారిని వివాహం చేసుకున్నవానికి వందనం. తనను ఆశ్రయించిన వారికి అనేక జన్మల ప్రారబ్ధాన్ని పోగొట్టి మోక్షమిచ్చేవానికి వందనం. యోగుల హృదయాలలో నివసించి, వారిని ఆశ్చర్యచకితులను చేసేవానికి వందనం. యశోదాసుతునికి చిన్నిపూలు.

23. మాతంగస్య కుశింశుమార జనిత ప్రాచుర్య దుఃఖాపహం
నారీ ప్రేరితరాజ కల్పితధ్రువ స్వాంతార్తి నాశం కరం
హేమాక్షాగ్రజమారణం నరహరిం ప్రహ్లాద సంరక్షకం
శ్రీనీళాధరణీ కరార్చితపదం వందేయశోదా సుతం.

భావము : మొసలికి చిక్కిన గజేంద్రుని దుఃఖాన్ని పోగొట్టినవాడు. పినతల్లి ప్రేరణ చేతను, తన తండ్రి ఉదాసీనత తోను తపస్సు చేసిన ధ్రువునికి శాశ్వత స్థానాన్నిచ్చి అతని మానసిక దుఃఖాన్ని పోగొట్టినవాడు. హిరణ్యాక్షుని అన్నయైన హిరణ్యకశిపుని సంహరించి ప్రహ్లాదుని రక్షించడానికి నారసింహరూపం ధరించినవాడు, శ్రీదేవి, నీళాదేవి, భూదేవి, మెత్తని చేతులతో సంవాహనం చేసే పాదాలు కలవాడు అయిన యశోదాసుతునికి కొల్పులు.

24. శిక్షా జ్యోతిష కల్పవ్యాకృతి ముఖాశేషోరుశాస్త్రాన్వయ
జ్ఞానాన్వీత మనో వికాసవిపుల వ్యాహార సంధాయకం
శైథిల్య శ్రుతిపూరణార్థధృత వీతిగ్రీవదివ్యాకృతిం
తారాధీశ సమాన వర్ణ కలితం వందేయశోదాసుతం

భావము : శిక్షా, జ్యోతిష, కల్ప, వ్యాకరణ మొదలైన వేదాంగాలను, తర్కం, మీమాంసా మొదలైన శాస్త్రాలను సమన్వయం చేయకలిగిన జ్ఞానంతో కూడిన మనస్సునకు తెలివిని కలిగించే విరివియైన మాటలను (తననాశ్రయించిన వారికి) కలిగించేవాడు. శిథిలములయిన వేదాలను పూరించడానికి హయగ్రీవ దివ్యాకృతి దాల్చినవాడు చంద్రునితో సమానమైన తెల్లని రంగు కలవాడు (శశివర్ణం) అయిన యశోదాసుతునికి చిన్నపూతేకులు.

25. **జ్ఞానానందమయం సుధాంశు నిలయం గీర్వాణ భాషామయం**
గ్రంథాన్వీత శయం మనోజ్ఞ కవితాధారా ప్రదం శ్రీ హయ
గ్రీవా కారధరం సరోజ నిలయా యుక్తం శ్రితస్వాంత మాం
ద్యాజ్ఞాన ప్రచురాంధకార మిహిరం వందే యశోదాసుతం

భావము : జ్ఞానానందమయమైన ఆత్మ స్వరూపం కలవాడు, అమృతమయమైన ప్రకాశం కలవాడు, సంస్కృత (దేవ) భాషా మయుడు, గ్రంథాలు చేతిలోపెట్టుకున్న వాడు, సొంపైన కవిత్వ ధార నిచ్చేవాడు, శ్రీ హయగ్రీవా కారాన్ని ధరించినవాడు, లక్ష్మితో కూడియున్నవాడు, అశ్రితుల బద్ధకం అజ్ఞానం అనే కటికి చీకటిని పోగొట్టడానికి సూర్యుని వంటి వాడు అయిన యశోదానందనునికి చేకూర్పు.

26. **సారాధారమహాప్రబంధ రచనాసామర్థ్య సంధాయకం**
నాస్తిక్యానృత వాదయుక్త జనగర్వారణ్య దావానలం
చంద్రస్థాణు మరాళ హీరమణితుల్య శ్వేత వర్ణాన్వితం
గంధర్వానన దేవమాదిపురుషం వందేయశోదాసుతం.

భావము : రీతులు, వృత్తులు, గుణాలు, అలంకారాలు మొదలైన లక్షణాలతో గొప్ప కావ్యాలు వ్రాయగల నైపుణ్యాన్ని ఇచ్చేవాడు (కూర్చేవాడు) వేదములు ప్రమాణం కాదనే అసత్యవాదాలు చేసే నాస్తిక జనుల గర్వమనే అరణ్యానికి దావాగ్ని వంటివాడు (దావాగ్ని అరణ్యాన్ని తగలబెడుతుంది). చంద్రుడు, శివుడు, రాజహంస, వజ్రములతో సమానమైన తెల్లని రంగు కలవాడు, గుఱ్ఱపు ముఖం కలదేవుడు (హయగ్రీవుడు) ఆదిపురుషుడునయిన యశోదానందనునికి చేమోడ్పు.

27. ఆదౌమౌని నిలింప సంఘహృదయ వ్యామోహవిచ్ఛేదన
జ్ఞానోత్పత్తి నిధానదేశికవరేణ్యం భూరి వైరాగ్యదం
హంసాకారధరం పురాణ పురుషం వేదాంత విద్యాప్రదం
శ్రౌతస్మార్త పురాణ కర్మఫలదం వందేయశోదాసుతం.

భావము : సృష్టి మొదట్లో, ఋషుల, దేవతా సమూహాల మనస్సులలో నున్న అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని కల్గించిన మొట్టమొదటి గురువు హంసావతారుడు, ఆ దేవముని సంఘాలకు గొప్ప వైరాగ్యాన్ని బోధించినవాడు, సనాతనుడు, ఉపనిషద్విద్యను ఇచ్చినవాడు, వేదము, స్మృతి (ధర్మశాస్త్రం) పురాణము లలో చెప్పిన రీతిగా కర్మలనాచరించే వారికి ఆయా ఫలాలనిచ్చేవాడు అయిన యశోదానందనునికి చేవిప్పు.

28. పూర్వేఽస్మిన్ గురుసన్నిధౌ వివిధ విద్యా వేదవేదాంగవే
దాంతాశేష కథాప్రబంధ వరచంపూ నాటకాది ప్రసి
ద్ధగ్రంధ గ్రహణే విశారదమతీతేమాసయుగ్మేసతి
స్వాచార్యాత్మజ జీవదాయకమముం వందే యశోదాసుతం

భావము : పూర్వం సాందీపని సన్నిధలో కాశీ గురుకులంలో అరవైరోజులలో అరవైనాలుగు విద్యలు, వేదాలు, వేదాంగాలు, (శిక్షాకల్పం మొ॥వి) ఉపనిషత్తులు, సమస్తగాథలు, ప్రబంధాలు, గద్య, పద్య యుక్తమైన చంపువులు, దృశ్య కావ్యాలైన నాటకాలు ఇత్యాది ప్రసిద్ధ గ్రంథార్థములను గ్రహించిన సూక్ష్మబుద్ధి కలవాడు, సముద్రస్నానం చేస్తూ సంవత్సరక్రితం చనిపోయిన గురు పుత్రుని యమలోకం నుండి తెచ్చి గురుదక్షిణగా యిచ్చినవాడు అయిన యశోదాసుతునికి జాగిలి.

29. బ్రాహ్మీబ్రహ్మహిమాద్రిజా పురహరోపాస్యం గజేంద్రానన
బ్రధ్న వ్యాసమునీంద్ర భార్గవసురాచార్యాది విద్వజ్జనా
నీకస్ఫార కలానువాక్యలహరీ సంధాయకం సత్కవి
త్వాధారం తురగాననాకృతి ధరం వందే యశోదా సుతం

భావము : సరస్వతి, బ్రహ్మ, పార్వతి, పరమశివుడు ఉపాసించే దైవం, వినాయకుడు, సూర్యుడు, వ్యాసమహర్షి, శుక్రాచార్యుడు, బృహస్పతి మొదలైన విద్వాంసులకు అరవైనాలుగు కళలకు సంబంధించిన శబ్దార్థాలను ప్రసాదించిన వాడు, మంచి కవిత్వానికి మూలమైనవాడు హయగ్రీవావతారం ధరించిన వాడు అయిన యశోదానందనునికి జేజే.

30. శయ్యాపాక పదార్థ భావయమకప్రాసాది సంధాయకం
ధారా శుద్ధి విరామరీతి వివిధాలంకార సంరక్ష కం
మాధుర్యధ్వని సుప్రసాదనియమాగారం ప్రబంధోద్భవా
ధారం శ్వేతతురంగ వక్త్ర సహితం వందే యశోదాసుతం

భావము : శయ్య (పదగుంభనం) పాక (ద్రాక్షాదిపాకము) పదములు అర్థాలు, వాటి భావాలు, యమక, ప్రాస మొదలైన శబ్దాలంకారాలు, కుంటుపడని కవిత్వధార, యతి, రీతి (గౌడీ వైదర్భిమొ॥) మొదలైన శబ్ద, అర్థ అలంకారాలు, మాధుర్య, వ్యంగ్య, ప్రసాద మొదలైన కవిత్వ గుణాలు కలిగిన ప్రబంధాలు పుట్టడానికి ఆధారమైన వాడు తెల్లని హయగ్రీవాకారం ధరించినవాడు అయిన యశోదానందనునికి జోహారు.

ఆశ్రితకల్పశాఖి

ద్వితీయప్రకరణం

31. సామాది వేదనిచయ ప్రతిరోధిఘోర
రాత్రించరాసుహరణం కమలాసనాయ
వేదప్రదం విలసదంబు చరావతారం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : సామవేదం మొదలైన వేద సమూహాన్ని అపహరించిన సోమకాసురుని ప్రాణాలను హరించి బ్రహ్మదేవుని కొరకు వేదాలనిచ్చిన మత్స్యావతారం ధరించినవాడు; మోక్షమిచ్చేవాడు, వసుదేవుని కుమారుడయిన కృష్ణునికి జోహారు.

విశేషం : ఈ రెండో ప్రకరణంలో ఛందస్సు వసంత తిలకావృత్తం
దీనికి వరుసగా త,భ,జ, జ, గగ, గణాలు వుంటాయి.

32. మంధాన భూధరధరం మథితాంబురాశిం
దత్తామృతామర చయం, కమఠావతారం
క్రవ్యాదమోహదవధూ విధరూపయుక్తం
కృష్ణం నమామివసుదేవ సుతం ముకుందం

భావము : కూర్మావతార మెత్తి మందర పర్వతాన్ని వీపున మోసి, పాలసముద్రాన్ని మథింపచేసినవాడు, మోహినీ అవతారంతో దేవతలకు అమృతమిచ్చినవాడు మోక్షమిచ్చేవాడు వసుదేవుని కుమారుడు కృష్ణునికి జోహారువు.

33. ధాత్రీ విపత్కర సువర్ణ విలోచనాఖ్య
రక్షఃకఠోర తను వృక్ష మహాకుఠారం
మౌనీంద్ర విస్మయదయజ్ఞవరాహమూర్తిం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : భూమికి అపాయాన్ని కల్గించే హిరణ్యాక్షుడనే రాక్షసుని క్రూర శరీరమనే చెట్టును గొడ్డలి నరికినట్లు నరికి మునులకు ఆశ్చర్యాన్ని కల్గించే యజ్ఞవరాహావతార మెత్తిన వాడు. మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి జోతలు.

34. ప్రహ్లాద కష్ట సముదాయ దురంతహేతు
క్రవ్యాశనాంత్ర దళనక్షమ శాతధారా
సంయుక్త ఘోర నఖరోజ్వల నారసింహం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : ప్రహ్లాదుని అనేక కష్టాలు పెట్టడానికి కారణమయిన హిరణ్యాకశిపుని పేగులు తెంచడానికి తగిన పదునుతో కూడిన భయంకరమైన గోరులతో ప్రకాశించే నారసింహావతారమెత్తిన వాడు మోక్షమిచ్చే వాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి జోవిళ్ళు.

35. పాదత్రయీ విపుల దాన నిమిత్తతుష్టం
వైరోచని ప్రచురగర్వతమో దినేంద్రం
త్రైలోక్యమోహన తనూజ్వల వర్ణి వర్యం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : మూడడుగుల నేల దానమిచ్చినందుకు సంతసించి బలిచక్రవర్తి గర్వమనే చీకటిని పోగొట్టిన సూర్యుని వంటి వాడు -మూడు లోకాలను మోహింపచేసే దేహకాంతి గల బ్రహ్మచారియైన వామనావతారమెత్తిన వాడు - మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి టెంకణాలు.

36. శూరాగ్రగణ్య వినుతాధిక విక్రమాఢ్యం
దుష్టావనీశ్వర కులక్షయ భూరిదక్షం
క్రూరార్జునాంతక మముం జమదగ్ని రామం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : మహాపరాక్రమవంతులచేత పొగడ్తలందే బలసంపద కలవాడు, నీచులైన క్షత్రియకులాన్ని నాశనం చేసే గొప్ప సమర్థుడు, దుర్మార్గుడైన కార్తవీర్యార్జునుని అంతం చేసిన పరశురామావతార మెత్తినవాడు - మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి తొంగలిపాట్లు.

37. మారీచనాశనకరం బలవత్సు బాహు
క్రవ్యాద శీర్ష దళనం హృతతాటకాయాః
ప్రాణానిలం, బుధనుతం రఘురామరూపం
కృష్ణంనమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : మారీచుని కనబడకుండా చేసినవాడు (సముద్రంలో పడవేసినవాడని భావం) బలవంతుడైన సుబాహు రాక్షసుని తలపగలగొట్టిన వాడు, తాటక యొక్క ప్రాణ వాయువులను అపహరించినవాడు, దేవతల స్తోత్రాలందుకొనేవాడు, రఘువంశంలో రామరూపంతో అవతరించినవాడు. మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి దండాలు.

38. స్వీయాంఘ్రి పద్మరజసా ముని వర్యజాయా
శాపాపహం పురజిదూర్జిత చాపభంగం
సీతాయుతం పరశురామ పరాక్రమఘ్నం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం

భావము : తన పాద ధూళితో అహల్య శాపం పోగొట్టినవాడు. శివధనువును విరిచినవాడు, సీతాదేవిని పెళ్ళి చేసుకున్నవాడు, పరశురాముని బలాన్ని హరించినవాడు, మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి దీవెన కోలలు.

39. సంవీత కోసల పురీభవ లోక వారం
వ్యాధాధి నాయక సమర్చిత పాదపద్మం
ఉల్లంఘి తామర ధునీ సలిల ప్రవాహం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : చుట్టూ చేరిన కోసల దేశ ప్రజలతో అడవికి బయలుదేరినవాడు, గుహుని పూజలందుకొన్నవాడు, గంగానదీ ప్రవాహాన్ని దాటినవాడు, మోక్షమిచ్చేవాడు. వసుదేవుని కుమారుడు కృష్ణునికి నేరెడల్లులు.

40. **మందాకినీ సలిల పూరవిహారసక్తం**
సర్వోత్తమం భరతపూజిత పాదపద్మం
దీక్షాంత సంశ్రుత నిజాధిక రాజ్యభారం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం

భావము : చిత్రకూట పర్వతంపైనున్న మందాకినీ నీటి ప్రవాహాల్లో విహరించే ఆసక్తి కలవాడు, అందరికంటే గొప్పవాడు, భరతుని పూజలందుకున్నవాడు, పదునాల్గు సంవత్సరాల తరువాత రాజ్యాన్ని పాలిస్తానని భరతునికి మాట యిచ్చినవాడు, మోక్షమిచ్చేవాడు. వసుదేవకుమారుడు కృష్ణనికి పిడికిలింతలు.

41. **విజ్ఞాపితాఖిల జటీశ్వర వాక్య తుష్ట**
మంగీకృతాసురవధం ధరణీకుమారీ
సంలాపలాలిత మముం జగదేకవీరం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం

భావము : ఋషుల శరణాగతికి సంతసించిన వాడు, రాక్షసులను చంపుతానని మాట ఇచ్చినవాడు, నిష్కారణంగా వైరమెందుకన్న సీతాదేవికి తన శరణాగత రక్షణదీక్షను తెలియచేసినవాడు, లోకైక వీరుడు - మోక్షమిచ్చేవాడు. వసుదేవ కుమారుడు కృష్ణునికి పొర్లు దండాలు.

42. **నిర్మూలితోచ్ఛ్రయ విరాధ కఠోరదేహం**
కర్మంది కంద ఫలభావిత తృప్తియుక్తం
కుంభోద్భవార్పిత శరాసన ఖడ్గపాణిం
కృష్ణంనమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : అస్త్ర శస్త్రాలకు తెగని విరాధుని దేహాన్ని పాతిపెట్టినవాడు, మునీశ్వరులర్పించిన కందమూల ఫలాలతో తృప్తి చెందినవాడు. అగస్త్య మహర్షి సమర్పించిన విల్లు ఖడ్గము చేతిలో ధరించినవాడు, మోక్షమిచ్చేవాడు. వసుదేవ కుమారుడు కృష్ణునికి మొక్కులు.

43. స్నిగ్ధీకృతాండజ కులాధిపతిం పవిత్రం
సంగీర్ణ చారుతర పంచవటీనివాసం
సౌమిత్రి నిర్మిత పలాశ నికాయ సక్తం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం

భావము : పక్షిరాజైన జటాయువుతో స్నేహం చేసినవాడు, కపటంలేని వాడు, సుందరమైన పంచవటిలో నివాసాన్ని అంగీకరించినవాడు, లక్ష్మణస్వామి నిర్మించిన పర్ణశాలలో ఇష్టంగా ఉన్నవాడు, మోక్షమిచ్చేవాడు - వసుదేవ కుమారుడు కృష్ణునికి మొగుపులు.

44. మాంసాదినీ ప్రచురమోహద సుందరాంగమ్
విచ్ఛేదితాశరవధూ శ్రుతి నాసికాగ్రం
దుష్ట క్షపాట నికర క్రథనానురక్తం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్

భావము : మాంసం తినే రాకాసి శూర్పణఖకు (తినాలనకుండా) మోహం కలిగించిన అందమైన శరీరం కలవాడు, ఆ రాకాసి ముక్కు చెవులు కోయించిన వాడు దుష్ట రాక్షసులతో యుద్ధానికి సిద్ధమైన వాడు, మోక్షమిచ్చేవాడు, వసుదేవ కుమారుడు కృష్ణునికి మోదుపులు.

45. ఘోరత్రిశీర్షఖరదూషణ నామధేయ
క్రవ్యాద్విశంకట కళేబరశైల శంబం
నానాక్షపాచర చమూ వనదావ వహ్నిం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్

భావము : మహాభయంకరులైన త్రిశీర్షుడు, ఖరుడు, దూషణుడు అను పేర్లుగల రాక్షసుల పెద్ద పెద్ద శరీరాలనే పర్వతాలకు వజ్రం వంటి వాడు, పదునాల్గు వేల రాక్షసులనే అడవికి దావాగ్ని వంటివాడు. మోక్షమిచ్చేవాడు. వసుదేవ కుమారుడు కృష్ణునికి మొక్కులు.

46. మాయాకురంగ పలలాశి వధ ప్రవీణం
నీడోద్భవాధిపతి ముక్తి ఫలప్రదానం
శక్తిం కబంధమనుజాశన శాపనాశమ్
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : మాయ లేడిగా వచ్చిన మారీచుని చంపిన వాడు. జటాయువునకు మోక్షమిచ్చినవాడు; కబంధుని శాపాన్ని పోగొట్టినవాడు, మోక్షమిచ్చేవాడు – వసుదేవకుమారుడు కృష్ణునికి వెన్నెలలు.

47. వ్యాధాంగనా సుఫల భావిత మోదయుక్తం
పంపాభిదాన రమణీయ సరోవిహారా
వాప్తాసమాస్త్రవిశిఖ వ్యసనాబ్ధి మగ్నం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : బోయస్త్రీ శబరి యిచ్చిన పండ్లను తిని సంతసించినవాడు, 'పంప' అను పేరుగల సుందర సరోవర సమీపంలో విహరిస్తూ, మన్మథబాణాలకు దుఃఖసముద్రంలో మునిగినవాడు. మోక్షమిచ్చేవాడు – వసుదేవ కుమారుడు కృష్ణునికి వెన్నెల కోలలు.

48. వీరాంజనేయ లపితామృత కల్పభాషా
పూరా దవాప్త విపులామలమోదపూర్ణం
పుత్రీకృతానిలసుతం సుకృతైక రాశిం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందమ్

భావము : వీరాంజనేయ స్వామి పల్కిన అమృత సమానమైన మాటలతో నిండుగా, తృప్తిగా నిష్కల్మషంగా ఆనందించినవాడు, వాయుపుత్రుని, పుత్ర సమానంగా చూసినవాడు, పున్నెములప్రోవు, పుణ్యరాశి. మోక్షమిచ్చేవాడు – వసుదేవ కుమారుడు కృష్ణునికి సలాములు.

49. సప్తాశ్వకర్ణక విభంజన కృత్యధీరం
వాలిప్రమాపణ విధాన నితాంత శూరం
సుగ్రీవ దుఃఖ హరణం సుఖదాయకం వై
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందమ్

భావము : ఏడు మద్దిచెట్లను విఱిచిన ధైర్యశాలి, వాలిని సంహరించిన మహాశూరుడు, సుగ్రీవుని దుఃఖాన్ని పోగొట్టి సుఖాలను ఇచ్చినవాడు – మోక్షమిచ్చేవాడు – వసుదేవకుమార కృష్ణునికి ఎఱగుళ్ళు.

50. వారాశి గర్వదళనక్షమ చాపపాణి
ముల్లంఘి తాంబుధి జలం కపిసైన్య యుక్తం
సందర్శితాసుర పురీవిభవాప్తరోషం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : ధనుస్సును ధరించి సముద్రుని గర్వం నశింపచేసిన సమర్థుడు. వానర సైన్యంతో సముద్రాన్ని దాటినవాడు, లంకా వైభవాన్ని చూసి కోపించిన వాడు, మోక్షమిచ్చేవాడు. వసుదేవ కుమార కృష్ణునికి కేలు మొగుపులు.

51. లంకాపురీ విమల సౌధ విశాల వప్ర
ప్రాసాద హర్మ్య మదిరాగృహ చైత్యగోష్ఠీ
విధ్వంసనోరు విశిఖ ప్రచయ ప్రవీణం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్

భావము : లంకాపురంలోని మంచి సున్నంతో కట్టిన మేడలు, విశాలమైన ప్రాకారాలు, అనేక అంతఃపుర భవనాలు, మిద్దెలు, పానశాలలు, రచ్చబండలు. వీటన్నింటినీ బాణాలతో నాశనం చేసిన నేర్పరి – వసుదేవ కుమార కృష్ణునికి చెంగనాలు.

52. **నక్తంచర ప్రముఖ కల్పిత భూరి మాయా**
విధ్వంసన క్షమ నిశాత శిలీముఖ ప్ర
పంచోరు కారణ భయంకర చాపయుక్తం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్.

భావము : రాక్షసవీరులు కల్పించిన గొప్ప మాయను నాశనం చేయ తగిన పదునైన బాణాలను ప్రయోగించే భయంకరమైన విల్లు ధరించినవాడు – వసుదేవకుమార కృష్ణునికి గిడిగిడి.

53. **దుష్టప్రహస్త ఘన కంపన మేఘనాథ**
కుంభాతికాయ మకరాక్ష పిశాచదేవ
శత్రుత్రిశీర్ష ముఖ రాక్షస నాశహేతుం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందమ్.

భావము : ప్రహస్తుడు, కంపనుడు, ఇంద్రజిత్తు, కుంభుడు, అతికాయుడు, మకరాక్షుడు, పిశాచుడు, దేవశత్రుడు, త్రిశీర్షుడు మొదలైన రాక్షసులను నాశనం చేసినవాడు. వసుదేవ కుమార కృష్ణునికి చేవిచ్చుటలు.

54. **కుంభ శ్రవోంగ దళనం దశ కంఠ కంఠ**
ధాత్రీరుహాళి నిశిత స్వధితం త్రిలోక
విఖ్యాత పూత చరితం విభవాభిరామం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్.

భావము : కుంభకర్ణుని శరీరాన్ని ముక్కలు చేసినవాడు, పదితలలు కల రావణుని శిరములనే చెట్లను పదునైన గొడ్డలితో నరికినట్లు నరికినవాడు. అందరికీ తెలిసిన పవిత్ర చరిత్ర కలవాడు, వైభవంతో (అవతారంతో) ప్రకాశించిన వాడు. వసుదేవకుమార కృష్ణునికి జోతాములు.

55. సీతా స్వకానుజయుతం ధననాధ పుష్ప
కాగ్రస్థితం వనచరేంద్ర విభీషణాది
మిత్రాన్వితం భరతదుఃఖ వినాశదక్షం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందమ్.

భావము : సీతతోను, లక్ష్మణుని తోను కూడి ముందు కూర్చుని, సుగ్రీవ విభీషణాది వానర రాక్షస వీరులతో పుష్పక విమానంపై వచ్చి భరతునికి దుఃఖాన్ని పోగొట్టిన సమర్థుడు.

వసుదేవకుమార కృష్ణునికి చెంగనాలు.

56. మాతుర్దు రంత హృదయ వ్యసనాగ్ని ధారా
సంపాత మిందు వదనం సమ పౌరభాగ్యం
ఊరీ కృతాత్మ నగరీ పరిపాల కృత్యం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : తల్లి గుండెలోకల దుఃఖమనే అగ్నిని నీటి జల్లుతో పోగొట్టినట్లు పోగొట్టిన వాడు. చంద్రుని వంటి ముఖం కలవాడు, పురజనుల సంపద, తన రాజ్యాన్ని పాలించడానికి అంగీకరించిన వాడు.

వసుదేవకుమార కృష్ణునికి గిడిగిళ్ళు.

57. పట్టాభిషేక సమయే ధరణీ కుమారీ
సౌమిత్రి యుగ్మ భరతాసుర కీశ మౌని
బ్రహ్మాంజనేయ దిగధీశ యుతాభిరామం
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : పట్టాభిషేక సమయంలో జానకీ, లక్ష్మణ, శత్రుఘ్ను, భరత, రాక్షస, వానర, ఋషి, బ్రహ్మ, ఆంజనేయ, దిక్పాలకులు దేవతలతో కూడి మనోహరంగా వున్నవాడు, మోక్షమిచ్చేవాడు –

వసుదేవకుమార కృష్ణునికి జోతలు.

58. సంగీర్ణ రాజ్య సమయే కపియాచ కేభ్యో
దుర్వర్ణ హేమ మణిధాన్య ధనాంబరాది
భోగ్య ప్రదం దినకరాన్వయ వార్ధిచంద్రం
కృష్ణం నమామి వసుదేవ సుతం ముకుందం.

భావము : రాజ్యపాలన అంగీకరించినప్పుడు వానరులకు, యాచకులకు, వెండి, బంగారం, మణులు రత్నాలు, ధాన్యం, ధనం, వస్త్రాలు మొదలైన సంపదలు ఇచ్చినవాడు, సూర్యవంశమనే సముద్రానికి చంద్రుని వంటివాడు.

వసుదేవ కుమార కృష్ణునికి జేజేలు.

59. నీలాంబరం ముసల సీరధరం ప్రలంబ
మాంసాశనాసుహరణం ద్వివిదాఖ్య నాశం
విధ్వంసితార్క తనయా లహరీ స్యదంవై
కృష్ణం నమామి వసుదేవసుతం ముకుందం.

భావము : నల్లని వస్త్రం, రోకలి, నాగలి ధరించినవాడు, ప్రలంబుడనే రాక్షసుని ప్రాణాలు తీసినవాడు, ద్వివిదుడనే వానరుని చంపినవాడు, యమునా నదీ ప్రవాహ వేగాన్ని నిరోధించినవాడు వైన బలరామావతార మెత్తినవాడు.

వసుదేవ కుమార కృష్ణునికి కైమోడ్పు.

ఆశ్రిత కల్పశాఖి

తృతీయ ప్రకరణం

60. ధనాయురారోగ్యయశః ప్రదాయకం
గజోష్ట్రగంధర్వ మహోక్ష శృంగిణీ
సమూహదం వంశ వివర్ధ కారణం
నమామి కృష్ణం జగదేక రక్షకమ్.

భావము : ధనం, ఆయువు, ఆరోగ్యం, కీర్తి ఇచ్చేవాడు ఏనుగులు, ఒంటెలు, గుఱ్ఱాలు, ఎద్దులు, ఆవులు ఇచ్చేవాడు, వంశాన్ని పెంచేవాడు, ఏ తోడూ లేక ఎక్కటియై లోకాన్ని రక్షించే కృష్ణునికి నమస్కరించుచున్నాను.

విశేషం : ఈ మూడో ప్రకరణంలో ఛందస్సు వంశస్థ వృత్తము
దీనిలో క్రమంగా జ, త, జ, ర అనే గణాలుంటాయి.

61. పరాశరవ్యాసమృకండు నందన
ప్రసిద్ధ గాధేయ వసిష్ఠ నారదా
త్రికుంభ జన్మాది మునీంద్ర వేష్టితం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : పరాశర, వ్యాస, మార్కండేయ, బ్రహ్మర్షి విశ్వామిత్ర, వసిష్ఠ, నారద, అత్రి, అగస్త్య మొదలైన మునిశ్రేష్ఠులచే సభ తీర్చినవాడు.

కృష్ణునికి నమస్సులు.

62. పురాతనోదార శ్రుతిస్మృతీడిత
ప్రశస్త కల్యాణ గుణాన్వితా శయం
దురాపసంతాప వనోరు పావకం
నమామి కృష్ణం జగదేగ రక్షకం.

భావము : సనాతన ఋజుమార్గాన్ని బోధించే వేదాలు, ధర్మశాస్త్రాలు, స్తోత్రం చేసి ప్రశంసించిన కల్యాణ గుణాలు కలవాడు, అనుభవించటానికి సాధ్యంకాని కష్టాలనే అడవులకు అగ్నివంటి వాడు.

కృష్ణునికి దండాలు.

63. ప్రభంజనా భీల విఘూత సంచయా
దపాయ రాహిత్య ఘనార్జునావనీ
రుహద్వయ ధ్వంసన కర్మణి క్షమం
నమామి కృష్ణం జగదేక రక్షకం

భావము : పెద్దపెద్ద గాలులు వీచినా చెదరకుండా నిలబడిన జంట మద్దులను అవలీలగా వాటి మధ్యగా రోలును లాగి కూల్చినవాడు.

కృష్ణునికి వందనం.

64. అహంకృతి స్ఫార ధురీణ పౌండ్రక
క్షితీశ్వర ప్రాణ గజాశ్వ వాహినీ
శతాంగ రాజ్యాది వినాశన క్షమం
నమామి కృష్ణం జగదేక రక్షకం

భావము : నేనే వాసుదేవుడను నీవు కాదని యుద్ధానికి వచ్చిన పౌండ్రక భూపతి ప్రాణాలను, ఏనుగులను, గుఱ్ఱాలను, భటులను, రథాలను రాజ్యాన్ని మొదలైన సంపదలను నశింప చేసిన సమర్థుడు.

కృష్ణునికి ఏటికోళ్ళు

65. పరీవృతానేక నరేంద్ర వాహినీ
సమూహ మధ్యస్థ విదర్భ కన్యకా
పరిగ్రహే శక్త మథారి ఘాతుకం
నమామి కృష్ణం జగదేకరక్షకం

భావము : చుట్టుముట్టిన నానా రాజసైన్య సంఘం మధ్యలోనున్న రుక్మిణీ దేవిని పట్టుకొని రథంపై కూర్చుండబెట్టుకు పోయే బలం సాహసం కలవాడు. శత్రు సైన్యాన్ని సంహరించినవాడు.

కృష్ణునికి జోహార్లు

66. అవాచ్య పారుష్య సమేత రుక్మిరా
ట్ఛిరోరుహ చ్ఛేదన కార్య హేతునా
పరా భవాపాదకమింది రాధిపం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : నోటికి వచ్చినట్లు కూసిన రుక్మిని (రుక్మిణీదేవి సోదరుని) వెంట్రుకలు సగం సగం పాయలు వారగ గొరిగి అవమానించిన లక్ష్మీవల్లభుడు –

కృష్ణునికి నతులు.

67. పురాజరా సంధ వినిర్మితాలయ
స్థితావనీ పాల విపన్నివారకం
జరాసుతప్రాణ వినాశకారణం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : పూర్వం జరాసంధునిచే బందీలయిన రాజుల బాధలను పోగొట్టిన వాడు – జరాసంధుని భీమునిచే చంపించిన వాడు.

కృష్ణునికి వినతులు.

68. సమస్త గోపాలక దత్త కూర్చికా
పయో ఘృతా పూప వరాన్నభక్షణా
దవాప్త సౌహిత్య సుపూరితా శయం
నమామి కృష్ణం వందే జగదేక రక్షకం.

భావము : గోపాలకులందరూ సమర్పించిన జున్ను, పాలు, నేయి, పిండి వంటలు, అన్నం, భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యా పానీయాలను గోవర్ధన పర్వత రూపంలో ఆరగించి సంతసించిన వాడు.

కృష్ణునికి మంగిడీలు.

69. శిలాయుతాసార హతోరుగోకుల
స్థితాంగనా పూరుష రక్షణాయ వై
ధృతాచలం వాసవ గర్వ మోచనం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : రాళ్ళ వర్షం కురుస్తుంటే భయపడిన గోవులను, స్త్రీ, పురుషులను రక్షించడానికి గోవర్ధన పర్వతాన్ని ఎత్తిపట్టుకుని దేవేంద్రుని గర్వాన్ని పోగొట్టినవాడు.

కృష్ణునికి నమస్సులు.

70. యుధిష్ఠిరోర్వీశ మహాసభాయాం
ప్రలాపపారీణ సపత్న చేదిరా
ట్ప్రమాపణే వర్తిత చక్రధారిణం
నమామి కృష్ణం జగదేకరక్షకం

భావము : ధర్మరాజు రాజసూయయాగంలో అగ్రపూజ అందుకుంటున్నప్పుడు నోటికి వచ్చినట్లు కూసిన శిశుపాలుని సుదర్శన చక్రంతో చంపినవాడు.

కృష్ణునికి జోతలు.

71. సుయోధన బ్రధ్నసుతాది దుర్జన
చ్ఛటాపరీ భావద విశ్వరూపక
ప్రదర్శనే నాధిక విస్మయావహం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : దుర్యోధనుడు, సూర్యుని పుత్రుడు కర్ణుడు, మొదలైన నీచ సంఘాలను తిరస్కరించి అనాదరించి, అవమానపరచి, విశ్వరూపాన్ని ప్రదర్శించి మహాశ్చర్యాన్ని కలిగించిన వాడు.
కృష్ణునికి వందనాలు.

72. ఉషాంగనా దోహద సిద్ధి పోషణం
ఘనానిరుద్ధా శయదుఃఖ శోషణం
బలిష్ఠ బాణాసుర దృష్టి భీషణం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : ఉషాకన్య కోరిక ఫలించేట్లు చేసినవాడు. అనిరుద్ధుని మనసులో దుఃఖాన్ని ఇంకించినవాడు, బలవంతుడైన బాణాసురుని భయపెట్టినవాడు.
కృష్ణునికి సలాములు
విశేషం : అంత్యానుప్రాసాలంకారం.

73. విదర్భ కన్యాకుచకుంకుమాంకితం
దినేంద్ర పుత్రీ ప్రచురార్హణోచితం
ప్రశస్త సత్రాజిదపత్య లాలితం
నమామి కృష్ణం జగదేక రక్షకం

భావము : రుక్మిణీదేవి స్తనాల కుంకుమ గుర్తులు కలవాడు, సూర్యసుత కాళింది పూజలందుకొన్నవాడు, సత్రాజిత్తు కుమార్తె సత్యభామను లాలించినవాడు.
కృష్ణునికి మొక్కులు.

74. వృషార్జునీ వల్లవలోక పావనం
నిరంత రాంగీ కృత భక్త జీవనం
జరాసుతా పాదిత దంభ ధావనం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : ఎద్దులను, ధేనువులను, గొల్లలను పవిత్రం చేసినవాడు. ఎల్లప్పుడు భక్తుల భారాన్ని మోసేవాడు, జరాసంధునికి భయపడి పదిహేడు సార్లు పారిపోయినట్లు నటించినవాడు.

కృష్ణునికి వందనాలు

విశేషం : అంత్యాను ప్రాసాలంకారం

75. ప్రభావతీ కామఫలై కకారణం
సునా భత త్వ్వార్వ్రజ. దండధారిణం
ప్రచండ హంసాసుర పద్మవారణం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : ప్రభావతి కోరిక ప్రకారం ప్రద్యుమ్నునితో వివాహం జరిపించినవాడు. అలాగే సునాభుడు అతని అన్న వజ్రనాభుడు. వజ్రనాభుని కుమార్తె ప్రభావతి. సునాభుని కుమార్తెలు చంద్రవతి, గుణవతి వారిని వరుసగా గదుడు, సాంబుడు పెళ్ళి చేసుకున్నారు. హంసుడుడిభకుడు ఇద్దరు సోదరులు వారికి ఎవరి వలనా చావులేదు. శ్రీకృష్ణుడు కపటంతో డిభకుడు చనిపోయాడని హంసునితో చెబితే హంసుడు ఆత్మహత్య చేసుకుంటాడు. ఈ వార్త విని డిభకుడు కూడా చనిపోతాడు. (పూర్తి వివరాల కోసం హరివంశ మహాపురాణం చూడండి) కృష్ణునికి నమస్సులు.

విశేషం : అంత్యాను ప్రాసాలంకారం.

76. **ప్రఫుల్లనీరేరుహపత్ర లోచనం**
సుదర్శన ప్రాక్తన శాపమోచనం
ప్రసిద్ధ జాంబూనద చేలరోచనం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : వికసించిన పద్మములవంటి విశాలనేత్రాలు కలవాడు. సుదర్శనుడనే విద్యాధరుడు గర్వంతో అంగీరస మునిని పరిహసిస్తే అందగాడినని విఱ్ఱవీగుచున్న నీవు వికారమైన పామువై పొమ్మని శపించాడు. మళ్ళీ ప్రార్థిస్తే శ్రీకృష్ణుని పాద స్పర్శచే నీ రూపం నీకు వస్తుందన్నాడు. అలా సుదర్శనుని శాపాన్ని పోగొట్టినవాడు. బంగారు వస్త్రం ధరించి ప్రకాశించేవాడు.

కృష్ణునికి జాగిళ్ళు.

77. **పరాత్పరం కాళియభోగి శిక్షకం**
నిదా ఘకాలేజ దవాగ్ని భక్షకం
నిరంత రారాధిత సర్వ భిక్షుకం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : దేవాదిదేవుడు, దుష్టకాళీయుని శిక్షించిన వాడు, వేసవికాలంలో పుట్టిన దావాగ్నిని మ్రింగి గోపాలకులను రక్షించినవాడు. అన్నిరకాల సన్యాసుల పూజలు ఎల్లప్పుడు అందుకునేవాడు –

కృష్ణునికి నమస్సులు.

విశేషం : అంత్యాను ప్రాసాలంకారం.

78. **కఠోర కంసాసుర చాపఖండనం**
నిరామయం సద్యదు వంశమండనం
సమాహితాదిత్య విరోధి భండనం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : ధనుర్యాగంలో కంసుని మాయా ధనుస్సును విరిచినవాడు. ఆరోగ్యవంతుడు. యదుకుల భూషణుడు, యుద్ధంలో దేవశత్రువులైన రక్కసులను మట్టుపెట్టేవాడు.

కృష్ణునికి టెంకణాలు

విశేషం : అంత్యానుప్రాసాలంకారం.

79. నిజాశ్రిత స్తోకక, నీలసేచకం
ప్రశస్త గీతామృత సార సూచకం
సుపోషితానేక పవిత్ర మోచకం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : తన భక్తులనే చాతక పక్షులకు మేఘము వంటివాడు (సేచక = మేఘం). ప్రసిద్ధమైన గీతాశాస్త్రసార అమృతాన్ని మరణంలేని విద్య, బోధించినవాడు (సూచకుడు = బోధించేవాడు) తనను పూజించిన అనేకమంది భక్తులకు మోక్షమిచ్చినవాడు. మోచకుడు = మోక్షమిచ్చేవాడు.

కృష్ణునికి వందనాలు

విశేషం : అంత్యానుప్రాసాలంకారం

80. గిరిస్థితేక్ష్వాకుసు తాప వర్గదం
బలిష్ఠమ్లేచ్ఛాధిప మృత్యు మార్గదం
వనీపకా నేక జన త్రివర్గదం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : కొండగుహలో వున్న ముచుకుందునికి మోక్షమిచ్చినవాడు. బలవంతుడైన కాలయవనునికి చావుదారి చూపినవాడు. అడిగిన వారికి ధర్మ, అర్థ, కామాలు (త్రివర్గాలు) ఇచ్చేవాడు.

కృష్ణునికి మొగుపులు.

విశేషం : అంత్యాను ప్రాసాలంకారం.

81. మమా రిషడ్వర్గ వినాశ కారణం
మమేంద్రియా నీకజయై కసాధనం
మమా శయ స్థాఖిల కామదాయకం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : నా యొక్క ఆర్గురు శత్రువులను (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) నా ఇంద్రియ జయానికి ఉపాయం అయినవాడు నా అన్ని కోర్కెలు తీర్చేవాడు.

కృష్ణునికి కైమోడ్పులు.

82. మమాలయా రామతలస్థ కల్పకం
మమవ్రజే సంస్థిత దేవనైచికీమ్
మమైక చింతామణి మాది పూరుషం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : మా దేవాలయమనే తోటలో వున్న కల్పవృక్షం, మా దొడ్లో వున్న కామధేనువు, మా కోర్కెలు తీర్చే చింతామణి, ఆదిపురుషుడు.

కృష్ణునికి చిన్నిపూలు.

83. మయా సదాలబ్ధ సుమేరు భూ ధరం
మమాంశుకే గ్రంధిత కాంచనోత్కరం
మయార్జితానేక సుపుణ్య సంచయం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : నాకు లభించిన బంగారు కొండ, నా చెంగున ముడివేసుకున్న బంగారు కాసులు, నేను సంపాదించిన పుణ్యరాశి.

కృష్ణునికి తొంగలిపాటు.

84. **మదీయ బంధుం మమమిత్ర సంహతిం**
మదీయ వప్తారమ ముంచ మాతరం
సహోదరం శాసక మాదివల్లభం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : నా చుట్టం, నా స్నేహితుల గుంపు, నా తండ్రి, నా తల్లి, నా తోబుట్టువు, నన్ను శాసించేవాడు, నా ప్రియుడు, నా అధిపతి.

కృష్ణునికి కేకిసలు.

85. **మదీయ భోగ్యం మమభూరి ధారకం**
సమస్త కాలేషు నితాంతపోషకం
మదన్వయానంద కరార్థ సంచయం
నమామి కృష్ణం జగదేక రక్షకం.

భావము : నేను అనుభవించువాడు, అన్ని కాలాల్లోనూ విడువకుండా పోషించేవాడు, మా వంశానికి ఆనందాన్నిచ్చే, ధనాన్ని ప్రోగుచేసి పెట్టేవాడు.

కృష్ణునికి జోతలు.

ఆశ్రిత కల్పశాఖి

చతుర్థ ప్రకరణం

86. వరానందకందం సుతాదిత్య బృందమ్
లసద్రా సకేళీ విలాసాప్త మోదం
దినేంద్రాత్మజా నీర కేళీ వినోదం
నమస్యామ్యహం వేణుగోపాలదేవమ్

భావము : శ్రేష్ఠమైన ఆనందానికి మూలకారణం, దేవతా సమూహాలచే పొగడ్తలందుకొనేవాడు, గోపకన్యలతో రాసకేళీవిలాసాలు సలిపి సంతసించినవాడు, కాళిందీ (యమునా) నదిలో జలక్రీడలతో వినోదం పొందినవాడు అయిన వేణుగోపాల దేవునికి నేను నమస్కరించుచున్నాను.

విశేషం : ఛందస్సు = భుజంగప్రయాతవృత్తం ప్రతిపాదంలోనూ నాలుగు (య) గణాలుంటాయి.

87. ప్రఫుల్లారుణాంభోజ తుల్యాంఘ్రి యుగ్మం
మృగేంద్రోపమస్ఫార సూక్ష్మావలగ్నం
కటిన్యస్తగాంగేయ సూత్రాభిరామం
నమస్యామ్యహం వేణుగోపాలదేవమ్

భావము : వికసించిన ఎఱ్ఱతామరల వంటి పాదాల జంట కలవాడు, సింహం నడుం వంటి సన్నని నడుం కలవాడు. బంగారు మొలతాడుతో ప్రకాశించేవాడు. వేణుగోపాలునికి వందనం.

88. విరించాండభాండచ్ఛటా ధారతుందం
రమాసంయుతాపీన వక్షోవిరాజం
భుజంగేశ్వరా భోగబాహుద్వయాక్తం
నమస్యామ్యహం వేణుగోపాలదేవమ్

భావము : బ్రహ్మాండములనే కుండల దొంతర్లు నిలవడానికి ఆధారమైన బొజ్జకలవాడు లక్ష్మీదేవి కూర్చునివున్న విశాలమైన ఱొమ్ముతో ప్రకాశించేవాడు. సర్పరాజు పడగల వంటి బాహువుల జంట కలవాడు అయిన వేణుగోపాలునికి నమస్సులు.

89. **మణీహారగ్రైవేయ కాన్వీత కంఠం**
మహా పద్మరాగోపమోష్ఠ ప్రదేశం
వరాదర్శ సుస్నిగ్ధ గండద్వయాక్తం
నమస్యామ్యహం వేణుగోపాలదేవమ్.

భావము : రత్నహారాలు, కంఠాభరణాలు మెడలో ధరించినవాడు. మంచి కెంపు వంటి ఎఱ్ఱని పెదవులు కలవాడు, శుభ్రమైన అద్దాల వంటి నున్నని చెక్కిళ్ళు జంట కలవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

90. **సువర్ణ ప్రసూనోపమా ఘ్రాణయుక్తం**
జ్వలత్కుండ లాలంకృత శ్రోత్రభాగం
మహాపూరుషత్వోచిత శ్మశ్రుయుగ్మం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : సంపెంగపూవు వంటి ముక్కు కలవాడు, మకర కుండలాలతో ప్రకాశించే చెవులు కలవాడు, మహా పురుష లక్షణాన్ని తెలిపే మీసాలు కలవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

91. **శరాసప్రతీకాశ సుభ్రూయుగాప్తం**
స్ఫుట శ్వేత నీరేజ పత్రాయతాక్షం
ప్రశస్తేంద్ర నీలాభ వాలాభిరామం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : వింటితో సమానమైన కనుబొమలు కలవాడు వికసించిన తెల్ల తామర రేకులవంటి కళ్ళు కలవాడు, మంచి ఇంద్ర నీలమణుల కాంతితో సమానమైన కాంతిగల శిరోజాలు కలవాడు అయిన వేణుగోపాలునికి నమస్సులు.

92. వినీలాల కోద్భాసిత స్ఫారఫాలం
స్ఫురత్కౌస్తుభోపేత కంఠాభిరామం
కిరీటస్థరత్న ప్రభా భాసమానం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : ముంగురులతో ప్రకాశించే నుదురు కలవాడు, కాంతిగల కౌస్తుభరత్నం మెడలో వేసుకున్నవాడు. కిరీటమునందలి నవరత్న కాంతులతో భాసించేవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

93. వ్రజ స్త్రీచయే నర్మ భాషా బ్రువంతం
యశోదాగృహేప్రీతమ త్యావతంసం
కళిందోద్భవీతీర భూమౌ చరంతం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : గోపకన్యలతో సరస సల్లాపాలు ఆడేవాడు, యశోద ఇంట్లో ఇష్టంగా తిరిగే కిశోరం, యమునా నదీతీర భూముల్లో విహరించే వాడు అయిన వేణుగోపాలునికి నమస్సులు.

94. వ్రజాంభోజ గంధీ సుచేలా పహారం
దధిక్షీర సత్కూర్చి కామస్తు చోరం
నిలింపాంగనా హృద్య కామ ప్రచారం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : గోపకన్యల వస్త్రాలు అపహరించినవాడు, పెరుగు, పాలు, మంచి జున్ను దొంగతనం చేసేవాడు. దేవతాస్త్రీల హృదయాల ప్రియమైన అందం ప్రదర్శించేవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

95. పయో భాండ భంగం క్రియా సుప్రసిద్ధం
వ్రజ స్త్రీ వివాదప్రదం హాసయుక్తం
కిశోరోచితోద్వేలఖేలా వినోదం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : పాలకుండలు పగలగొట్టడంలో నేర్పరి. గొల్లవనితలకు తగాదాలు పెట్టి నవ్వుతుండేవాడు. పిల్ల పనులు ఆటలతో ఆనందించేవాడు. అయిన వేణుగోపాలునికి నమస్సులు.

96. వరాభీర బాలోపచారాను రక్తం
సమస్తార్జునీ వేష్టితా కార రమ్యం
సదాసుస్మితాన్వీత పూర్ణేందు వక్త్రం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం

భావము : గొల్ల పిల్లలతో సేవలందుకునేవాడు తన చుట్టూ చేరిన గోవుల మధ్యలో విలాసంగా నిలబడి వున్నవాడు. ఎల్లప్పుడు చిరునవ్వుతో కూడిన పూర్ణ చంద్రుని వంటి ముఖం కలవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.
విశేషం : రామావతారంలో అప్పుడప్పుడు దుఃఖించాడు కాని కృష్ణావతారంలో సర్వకాల, సర్వదేశ, సర్వావస్థలలోనూ చిరునవ్వుతోనే వున్నాడు.

97. తమా లేంద్ర నీలాంబుదో మాసుమక్షా
రవా రాశి నీరోపమశ్యామ లాంగం
జగద్వ్యాపనోద్వేల కీర్తి ప్రసిద్ధం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : తమాలవృక్షం, ఇంద్రనీల మణి, మేఘము, ఉమాసుమ = నల్ల అగిసెపువ్వు, ఉప్పు సముద్రమునీరుతోనూ సమానమైన నల్లని శరీరం కలవాడు, అన్ని లోకాలలోనూ వ్యాపించిన గొప్ప కీర్తితో ప్రసిద్ధుడయినవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

98. **నఖాళి ప్రభా గర్వితా శేష ఋక్షో**
త్కరం చారు ముక్తావళీ దంత యుక్తం
ప్రశస్తం జలస్థం స్థలస్తం సమస్తం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : అనేక నక్షత్ర రాశులను తిరస్కరించే గోరుల కాంతి కలవాడు, మంచి ముత్యముల వంటి పలువరుస కలవాడు. నీటియందు, భూమి మీద అన్ని చోట్ల పొగడ్తలందే వాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

99. **సితాభ్రాను బోధా గురుస్ఫార కృష్ణా**
గురుశ్రేష్ఠ గోశీర్ష పన్నీరతుల్య
ప్రభూత స్థిరామోద సంయుక్తగాత్రం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : సితాభ్ర = కర్పూరం, అనుబోధ = అత్తరు, అగురు = అవురుగడ్డి (పరిమళముకలుగు) కృష్ణాగురు = నల్ల సుగంధద్రవ్యం, గోశీర్ష = హరిచందనం, పన్నీరు మొదలైన సుగంధ ద్రవ్యాల వంటి పరిమళం వెదజల్లే శరీరం దివ్యమంగళ విగ్రహం కలవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

100. **అమోఘాగ చాంపేయ పున్నాగమాఖ్య**
ప్రసూనోత్ప లాంభోజ సౌగంధి కేందీ
వరాతీత సౌరభ్య సంయుక్త గాత్రం
నమస్యామ్యహం వేణు గోపాలదేవం.

భావము : పాటలీ, సంపెంగ, పొన్న ఈ చెట్ల పుష్పాలు, కలువ, తామర, చెంగలువ, నల్లకలువ, ఈ మొత్తం పూవుల కంటె అధికమైన పరిమళం గల దివ్యంమగళ విగ్రహం కలవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

101. శిరీష ప్రసూనచ్ఛటా పుండరీక
ప్రవాళోత్పలాశేష సౌరభ్య పుష్ప
ప్రతీకాశ సత్కోమలత్వాభి రామం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : దిరిసెన పూలరాశి, తెల్లరామరలు మెత్తని చిగుళ్ళు, కలువలు మొదలైన సమస్త సువాసనలు గల పుష్పాలతో సమానమైన మృదుత్వం, మార్దవం గల దివ్యమంగళ విగ్రహంతో మనోహరంగా దర్శనమిచ్చేవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

102. ప్రమాదాది దుర్మోహ శూన్య ప్రచారం
తమోరాజసాన్వీత చిత్తాతి దూరం
సమస్తాగమస్తుత్య పూతావతారం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం.

భావము : ప్రమాదం = ఒక పని చేయబోయి మరొక పని చేయడం.
ఆది = మొదలైన అనగా ఆలస్యం బద్ధకం లాంటివి.
దుర్మోహ = ఏ పని ఎలా ఎంతవరకు ఎప్పుడు చేయలో తెలియక చేయటం ఇలాంటి దుష్టకర్మలు చేయనివాడు తమోగుణం రజోగుణంతో కూడిన చిత్తము కలవారికి దూరంగా వుండేవాడు. సకల వేదశాస్త్రాలు ప్రస్తుతించిన పవిత్రమైన అవతారం ఎత్తినవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

103. విచిత్రా స్వదానేక లీలా సమేతం
ప్రంచోద్భవస్థిత్య పాయైక హేతుం
జరా రోగరాగాది మధ్యాంత శూన్యం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం

భావము : అనేక వింతలు గొల్పే లీలలు చేసినవాడు, జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయాలకు కారణమైనవాడు, ముసలితనం, వ్యాధులు, అతుక్కుపోవడం, ఆది, మద్య, అంతం లేనివాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

104. పిపాసాక్షు దాశావిరోధార్తి చింతా
రుషాతాప నిద్రాది కేర్ష్యా దవిష్టం
అసూయాపవాదాఘ నిర్మూలహేతుం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : దాహం, ఆకలి, ఆశ, పగ, బాధ, విచారం, కోపం, తాపం, నిద్ర, ఈర్ష్య మొదలైన దుర్గుణాలకు దూరంగా ఉండేవాడు. అసూయ, నీలాపనింద, పాపం వీనిని పోగొట్టడానికి హేతువు కారణమైనవాడు నిఖిల హేయ ప్రత్యనీకుడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

105. విసారాకృతిం కచ్ఛపాకారధ్యుర్యం
కిటిం నారసింహం వటుం భార్గవం రా
ఘవేశం బలం శ్రీఘనం కల్కి రూపం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం

భావము : మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, బుద్ధ, కల్కిరూప దశావతారాలెత్తినవాడు, అయిన వేణుగోపాలునికి వందనాలు.

106. పరేశం సురేశం దరఘ్నం మురఘ్నం
జితారింభృతారిం శ్రితాప్తం శ్రుతీడ్యం
భువిస్థం దివిస్థం రవిస్థం శశిస్థం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : పరాత్పరుడు, దేవదేవుడు, భయం పోగొట్టేవాడు, మురాసురుని చంపినవాడు, శత్రువులను జయించినవాడు, చక్రం ధరించినవాడు, తనను ఆశ్రయించినవారికి మేలు చేసేవాడు, వేదాలు స్తోత్రం చేసేవాడు, భూలోకంలో, స్వర్గలోకంలో సూర్యచంద్రులలో నివసించి లోకాలకు రక్షణనిచ్చేవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

107. సమీరాత్మజా రాధితం శైలపుత్రీ
పురారి స్తుతాంఘ్రి ద్వయం రామ చంద్రం
నిషంగాశుగేష్వాసనిస్త్రింశపాణిం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం

భావము : వాయుపుత్రుని పూజలందుకొన్నవాడు, పార్వతీ పరమేశ్వరులు స్తోత్రం చేసే పాదద్వయం కల రామచంద్రుడు, అమ్ముల పొదులు, బాణాలు, విల్లు, ఖడ్గం ధరించినవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

108. జగద్భంధుకోటి ప్రతీకాశభూరి
ప్రభాసంయుతాంగం విభూతి ద్వయాఢ్యం
పరాకాశవాసం మహా సూరి వంద్యం
నమస్యామ్యహం వేణుగోపాలదేవం.

భావము : కోటిసూర్యుల కాంతితో సమానమైన గొప్ప వెలుగుతో ప్రకాశించే దేహం, దివ్య మంగళ విగ్రహం కలవాడు, లీలావిభూతి, నిత్య విభూతి అని పేర్లు గల రెండు విభూతుల సంపద కలవాడు పరాకాశం, పరమపదంలో నివసించేవాడు, నిత్య సూరుల పొగడ్తలందుకునేవాడు అయిన వేణుగోపాలునికి వందనాలు.

విశేషం : ఏదీ మిథ్యకాదు అంతా సత్యమేనని ఈ శ్లోక తాత్పర్యం.

109. కుబేరార్పితాక్షీణ రాజన్నిధాన
చ్ఛటాప్రాపితామోదసంయుక్త చిత్తం
సుధర్మాస్థితాత్మీయ గోష్ఠీ వినోదం
నమస్యామ్యహం వేణు గోపాలదేవం.

భావము : ద్వారకా పట్టణ నిర్మాణ సమయంలోనే కుబేరుడు అర్పించిన నవ నిధులు కలవాడు దేవేంద్రుడు పంపిన సుధర్మ సభలో బంధువులతో వినోదంగా గడిపినవాడు అయిన వేణుగోపాలునికి శతకోటి వందనాలు.

110. **దినేంద్రాత్మజా రుక్మిణీ సత్యభామా**
ముఖాష్ట ద్వితీయా యుతం రాజ కన్యా
సహస్ర చ్ఛటాలాలితం భోగి వర్యం
నమస్యామ్యహం వేణుగోపాల దేవం

భావము : కాళిందీ, రుక్మిణీ, సత్యభామా మొదలైన అష్టభార్యలు, పదహారు వేల రాకుమార్తెలు లాలిస్తుండగా మహా భోగాలు అనుభవించినవాడు అయిన వేణుగోపాలునికి సహస్రకోటి వందనాలు.

111. **ఇత్థం వేంకట దాస నామ కవినాప్రోక్తం మయా స్వల్ప వా**
గ్జాలోపేత నుతిం గృహాణనృపతి స్సద్భోజనా నంతరం
తాంబూల గ్రహణం కరోతిచ యధాతద్వ త్సుకావ్యావళి
స్వీకారోపరి పంకజాక్ష సుహృదంజానేనహిత్వాం వినా.

భావము : ఓ పుండరీకాక్షా! శ్రీకృష్ణా!

ఇలా, ఈ విధంగా, వేంకటదాసు అను పేరు గల (ప్రసిద్ధినొందిన) కవినైన నా చేత స్వల్ప వాక్సమూహంతో చేసిన 'ఆశ్రిత కల్పశాఖి' అను పేరుగల ఈ స్తోత్రాన్ని –

రాజుగారు షడ్రుచులతో భోజనం చేసిన తరువాత తాంబూలం వేసుకున్నట్లుగా నిన్ను స్తోత్రాలు చేసిన మహాకావ్యాలను స్వీకరించిన తరువాత దీనిని గ్రహించు. నా మేలు కోరే నిన్ను తప్ప వేరేమియు తెలియనివాడను.

ఇది శ్రీ సీతావల్లభ ప్రసాద సమాసాదిత కవితాధురీణ
శ్రీ వేదాల సీతారామాచార్యాను గ్రహలబ్ధ మంత్ర రత్నాను సంధాన పవిత్రాంతరంగ,
నిఖిల దుర్మత శిలోచ్చయ దంభోళీభూత సముద్రాల లక్ష్మణాచార్యాను గ్రహబోధిత
విశిష్టాద్వైత రహస్యార్థ ధురంధర, శఠగోప, యతిరాడ్వర వరయోగి
ప్రభృతి పూర్వాచార్య చరణ సరోజ భ్రమరాయమాణ,
శ్రీ మొవ్వ వంశతిలక కృష్ణార్యకృష్ణమాంబా తనూజ
శ్రీ వైష్ణవ విధేయ వేంకటదాస నామధేయ
ప్రణీతంబైన ఆశ్రితకల్ప శాఖిస్తోత్ర రత్నానికి
తదేక లవ్యశిష్య ఉభయ వేదాంత విద్యావాచస్పతి
వక్కపట్ల వృషాద్రిపతి యథామతి లిఖించిన
భావపరిమళ ప్రకాశము సర్వమూ సంపూర్ణము
శ్రీకృష్ణార్పణమస్తు

శ్రీమతే రామానుజాయ నమః

స్వస్తిశ్రీ [illegible] నామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ దశమి [illegible]

[illegible] 33 [illegible]

33 [illegible]

కుంభరాశి

జననకాల లగ్న విశేష [illegible] ఘటికా [illegible] 37

[illegible]